ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 212
బుధవారం 12 ఆగస్టు 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.



## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం..

### ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం: మోదీ

- ‘హర్ ఘర్ తిరంగా’లో పాల్గొనాలని మోదీ పిలుపు
- ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని సూచన
- స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని విజ్ఞప్తి
- ‘వికసిత్ భారత్’ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపు
- ఈ ఏడాది ‘వందేమాతరం’కు ప్రత్యేక ప్రాధాన్యం

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 11)

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ‘హర్ ఘర్ తిరంగా’ కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు. ‘హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా’ అంటూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను షేర్ చేసుకున్న ప్రధాని.. ఆగస్టు 15ను గర్వంగా జరుపుకోవాలని సూచించారు. ‘వికసిత్ భారత్’ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. “ప్రతి ఇంటా హర్ ఘర్ తిరంగాను ఓ వేడుకగా మార్చుకుందాం” అని పేర్కొన్నారు. ▶2లో

## పరుగులు పెడుతున్న
# ఏపీ ఆర్థిక వ్యవస్థ..



- జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి
- జాతీయ సగటును మించి ఏపీ ఆర్థిక వృద్ధి నమోదు
- 2025-26లో 9.9 శాతానికి చేరిన రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు
- వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన ప్రగతి
- ఎల్ నినో ప్రభావంపై సీఎం చంద్రబాబు ఆందోళన
- సంక్షోభంలోనూ 15% వృద్ధి లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు ఆదేశం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 11)

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధి పథంలో పయనిస్తోంది. జాతీయ వృద్ధి రేటును అధిగమించి, వరుసగా రెండో ఏడాది కూడా రాష్ట్రం మెరుగైన ప్రగతిని నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు 9.9 శాతానికి చేరుకున్నట్లు జులై 2026 నెలవారీ ఆర్థిక నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుకు ప్రణాళికా విభాగం అధికారులు ఈ నివేదికను సమర్పించారు. నివేదిక ప్రకారం, వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో రాష్ట్రం గణనీయమైన వృద్ధిని సాధించింది. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం, పారిశ్రామిక రంగం 10.6 శాతం, సేవా రంగం 9.9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ముఖ్యంగా సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి 304 శాతం, వాణిజ్య వాహనాల విక్రయాలు 51.6 శాతం, ఎస్‌టిపిఐ ఎగుమతులు 32.2 శాతం మేర పెరిగాయి. సాంకేతికత వినియోగం ద్వారా ▶2లో





## అమెరికాకు ఆంక్షల వ్యసనం పట్టింది: ఇరాన్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 11)

తమ దేశంపై ఆంక్షలు విధించడం అమెరికాకు వ్యసనంగా మారిందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి విమర్శించారు. ఆంక్షలతో ఇరాన్‌ను ‘ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాం’ అని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ చెప్పడంపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దౌత్య మార్గంలో లక్ష్యాలను సాధించలేనప్పుడల్లా అమెరికా ఆంక్షలు విధిస్తోందని ఆరోపించారు. అవి ఫలించకపోతే మరింత తీవ్రత పెంచుతోందని పేర్కొన్నారు. ఇది ఒక అలవాటుగా, చివరకు ▶2లో

## సురక్షితంగా తీసుకొస్తాం..



- ఉద్యోగాల పేరుతో థాయ్‌లాండ్‌కు వెళ్లి మోసపోయిన తెలుగు యువత
- సైబర్ నేరగాళ్ల చెర నుంచి తప్పించుకుని సరిహద్దుల్లో చిక్కుకున్న బాధితులు
- స్పందించిన మంత్రి నారా లోకేశ్, సురక్షితంగా రప్పిస్తామని హామీ
- విదేశాంగ శాఖ అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు వెల్లడి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 11)

ఉద్యోగాల ఆశతో థాయ్‌లాండ్‌కు వెళ్లి, సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కి మోసపోయిన తెలుగు యువతకు ఏపీ ప్రభుత్వం అండగా నిలిచింది. మయన్మార్-థాయ్‌లాండ్ సరిహద్దుల్లో నిస్సహాయ స్థితిలో చిక్కుకుపోయిన వారిని సురక్షితంగా స్వదేశానికి రప్పిస్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేసి, కేంద్ర విదేశాంగ శాఖతో సమన్వయం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వివరాల్లోకి వెళితే...ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు, హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒకరితో సహా మొత్తం ఆరుగురు యువకులు మంచి ఉద్యోగాల కోసం ఓ ఏజెంట్‌ను నమ్మి థాయ్‌లాండ్‌కు వెళ్లారు. అయితే, అక్కడకు చేరాక వారు మోసపోయారని గ్రహించారు. సైబర్ నేరాలకు పాల్పడే ఓ ముఠా వీరిని నిర్బంధించి, తీవ్రమైన ఒత్తిడి, వేధింపులకు గురిచేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాల్లోకి బలవంతంగా దించింది. ఈ నరకం నుంచి బయటపడేందుకు బాధితులు ఎలాగోలా కొంత డబ్బు చెల్లించి, వారి చెర నుంచి తప్పించుకున్నారు. ప్రస్తుతం వారు థాయ్‌లాండ్ వైపు ఉన్న మయన్మార్ సరిహద్దు ప్రాంతానికి చేరుకుని అక్కడే చిక్కుకుపోయారు. తమను ఎక్కడికైనా తరలించే ప్రమాదం ఉందని భయపడుతూ, తమను రక్షించాలంటూ సోషల్ మీడియా ద్వారా వేడుకున్నారు. ▶2లో



## కమ్యూనిస్టులు పిరికివారు

### కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ విమర్శ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 11)

దేశంలోని కమ్యూనిస్టులను పిరికివారంటూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ విమర్శించారు. రాజ్యసభలో పన్నులు, ఇతర చట్టాలు (సవరణ) బిల్లు 2026పై చర్చ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ▶2లో

## మనలో మనం విమర్శలు చేసుకోవద్దు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 11)

కూటమి పార్టీల కార్యకర్తలు, అభిమానుల మధ్య విభేదాలు సృష్టించేందుకు, చిచ్చుపెట్టేందుకు వైకాపా చేస్తున్న కుట్రల విషయంలో అప్రమత్తంగా ఉండాలని శ్రేణులకు సూచిస్తూ మూడు పార్టీలు (తెలుగుదేశం, జనసేన, భాజపా) సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. కూటమి పార్టీల అభిమానులు, కార్యకర్తల ముసుగులో గొడ్డలి పార్టీ సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఖాతాలతో మూడు

- సోషల్ మీడియా నకిలీ ఖాతాలతో గొడ్డలి పార్టీ కుట్రలు
- ఆ మాయలో పడి ఆవేశపడొద్దు
- కూటమి మిత్రధర్మాన్ని విస్మరించొద్దు
- శ్రేణులను అప్రమత్తం చేస్తూ ఎన్డీయే ఉమ్మడి ప్రకటన



పార్టీల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తాయి. ‘వైకాపాకు చెందినవారు.. కూటమిలోని ఒక పార్టీకి అభిమానుల్లా నటిస్తూ మరో మిత్రపక్ష నాయకులపై తీవ్ర విమర్శలు, వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు. పరువుకు భంగం కలిగించేలా పోస్టులు, కామెంట్లు పెడుతున్నారు’ అని ఎన్డీయే సోషల్ మీడియా కోఆర్డినేషన్ కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. “ఉదాహరణకు తెదేపా అభిమాని ముసుగులో నిర్వహించే ఒక ఫేక్ ఖాతాలో.. చంద్రబాబును పొగుడుతూ, పవన్‌కల్యాణ్‌ను విమర్శిస్తారు. జనసేన అభిమాని ముసుగులో నిర్వహించే మరో నకిలీ ఖాతాలో చంద్రబాబుపై తీవ్ర విమర్శలు గుప్పిస్తారు. వైకాపా కుట్రను గుర్తించలేని కూటమి పార్టీల కార్యకర్తలు ఆవేశానికి లోనై మిత్రపక్షాలపై దాడులకు దిగుతున్నారు. చివరకు మనలో మనమే గొడవ పడుతూ వైకాపాకు రాజకీయంగా ప్రయోజనం కల్పిస్తున్నాం” అని ఆ ప్రకటనలో కమిటీ పేర్కొంది. “ఎన్డీయే భాగస్వామ్య పక్షాలన్నీ కలిసి వైకాపా కుట్రలను తిప్పికొట్టి, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ▶2లో




## కోకాపేటలో ట్రంప్ టవర్స్..
## 65 అంతస్తులు, 450 ఫ్లాట్లు

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 11)

హైదరాబాద్: భాగ్యనగరంలో మరో అతిపెద్ద రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ ప్రారంభం కాబోతోంది. కోకాపేటలోని గోల్డెన్ మైల్ రోడ్డులో ట్రంప్ టవర్స్ ఏర్పాటు కానున్నాయి. ట్రంప్ ఆర్గనైజేషన్, ట్రిబెకా డెవలపర్స్, ఐరా రియాల్టీ సంస్థలు సంయుక్తంగా వీటి నిర్మాణ బాధ్యతలు చేపట్టనున్నాయి. మొత్తం 65 అంతస్తులతో రెండు టవర్ల నిర్మాణం జరగనుంది. అతి ఖరీదైన 450 ఫ్లాట్లు ఉండనున్నాయి. ట్రంప్ టవర్స్‌కు ఇప్పటికే రెరా అనుమతులు ఇచ్చింది. ఈ టవర్ల ఎత్తు 240 మీటర్లు ఉంటుంది. ▶2లో

## రాయలసీమపై వైసీపీది కపట ప్రేమ..

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 11)

రాయలసీమ ప్రాంత అభివృద్ధి పరుగులు పెడుతుంటే చూసి ఓర్వలేక వైసీపీ నేతలు కళ్లు మూసుకుని విమర్శలు చేస్తున్నారని, రైతుల పేరుతో రాజకీయ డ్రామాలకు తెరలేపారని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఐదేళ్ల పాటు రాయలసీమను గాలికొదిలేసిన జగన్ రెడ్డి, ఇప్పుడు ప్రాజెక్టుల సందర్శనల పేరుతో తీర్థయాత్రలు చేయడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. నేడు మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. “వంద పీనుగులను తిన్న రాబందు పాప ప్రక్షాళన కోసం తీర్థ యాత్రలకు వెళ్లినట్లుగా ఉంది వైసీపీ నేతల తీరు” అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయలసీమ అభివృద్ధి ▶2లో



# 14వ వార్డులో ఘనంగా ఇంటింటికీ తెలుగుదేశం

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

రాష్ట్ర కనీస వేతనాల డైరక్టర్ దాసరి బాబు





(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 11)

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 45 రోజుల 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు 86వ బూత్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షులు, రాష్ట్ర కనీస వేతనాల డైరెక్టర్ దాసరి బాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అలాగే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం దాసరి బాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ నాయకత్వంలో మైదుకూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ 45 రోజుల కార్యక్రమం ద్వారా వార్డులోని ప్రతి సమస్యను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జ్ తుపాకుల రమణ, పట్టణ ప్రధాన కార్యదర్శి రాకెట్ రఫీ, దాసరి సత్యనారాయణ, భూమిరెడ్డి అంజి, సిద్దయ్య ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అఖిల భారత పోలీస్ గేమ్స్‌లో మెరిసిన కడప పోలీసులు

విజేతలను అభినందించిన

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, ఆగస్టు 11)

తెలంగాణలోని హైదరాబాద్ గచ్చిబౌలిలో నిర్వహించిన 11వ అఖిల భారత పోలీస్ గేమ్స్ 2026లో కడప జిల్లా పోలీస్ సిబ్బంది విశేష ప్రతిభ కనబరిచారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన సిబ్బందిని కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రశంసించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విజేతల ప్రతిభ జిల్లా పోలీస్ శాఖకు, ప్రొద్దుటూరు సబ్ డివిజన్‌కు ఎంతో గర్వకారణమని తెలిపారు. వీరి కృషి మరియు పట్టుదల ఇతర సిబ్బందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రొద్దుటూరు 3 టౌన్ పోలీస్ స్టేషన్ మహిళా కానిస్టేబుల్ పి శివకుమారి పెంచాక్ సిలాట్ క్రీడలో ఓపెన్ 2 ఓవర్ 100 కేజీల విభాగంలో రజత పతకం సాధించారు. ప్రొద్దుటూరు 2 టౌన్ ఎస్ఐ ఎస్ మహబూబ్ బాషా, ప్రొద్దుటూరు ట్రాఫిక్ కానిస్టేబుల్ ఎస్పి మహబూబ్ బాషా తైక్వాండో క్రీడలోని పూమ్సె విభాగంలో క్వార్టర్ ఫైనల్ వరకు చేరుకుని ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి రమణయ్య, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ..

జీఎస్టీ వసూళ్లు 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరాయి. రాష్ట్రంలోకి పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ. 2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబడుల్లో 75.4 శాతం మేర గ్రౌండింగ్ పూర్తయింది. ఈ నివేదికను సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైందని, కృష్ణా నదిలో నీటి లభ్యత లేక శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులు నిండలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సంక్షోభ పరిస్థితుల్లోనూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు దెబ్బతినకుండా పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రం 15 శాతం వృద్ధి రేటును సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రజలపై ధరల భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా నివేదికలు రూపొందిస్తే లక్ష్యాల సాధన సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక, ప్రణాళికా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టులు పిరికివారు

యూపీఐ చెల్లింపుల ఛార్జీలపై సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ దేశంలో అయోమయాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆక్షేపించారు. అంతకు ముందు బ్రిట్టాస్ మాట్లాడుతూ.. అమెరికా ఒత్తిడితోనే యూపీఐ చెల్లింపులకు రుసుములు వసూలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆరోపించారు. దానికి సీతారామన్ సమాధానం ఇస్తున్న సమయంలో ఆయన సభ నుంచి బయటకు వెళ్లేందుకు బయలుదేరారు. దీనిపై ఆమె స్పందిస్తూ.."జాన్ బ్రిట్టాస్ జీ.. నేను చెప్పే సమాధానం వినదలిస్తే దయచేసి సభలో కూర్చోండి. వాస్తవాలను వక్రీకరించి అభాండాలేయడం కమ్యూనిస్టుల నైజం. వారు నిజాలను మరుగున పరుస్తూ తమకు మాట్లాడే హక్కుందంటూ డిమాండ్ చేస్తారు. తీరా వివరంగా సమాధానం చెప్పే సమయానికి వినడానికి వారికి ధైర్యం ఉండదు. పిరికిపందలు. బ్రిట్టాస్ ఆ విషయాన్నిప్పుడు నిరూపించారు. అడిగేందుకు హక్కు ఉందన్నవారికి వినే ఓపిక లేదా? నాకూ బదులు చెప్పే హక్కు ఉంది" అని పేర్కొన్నారు. సీతారామన్ మాటలను వినిపించుకోకుండానే బ్రిట్టాస్ సభ నుంచి వాకౌట్ చేశారు.

**పాత పింఛను పునరుద్ధరణ ప్రతిపాదన లేదు: కేంద్రం**

పాత పింఛను విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించే ప్రతిపాదనేదీ లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వ ఖజానాపై భరించలేని ఆర్థిక భారం పడే అవకాశమున్నందున ఈ దిశగా ఆలోచించడం లేదని పేర్కొంది. లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి ఈ సమాధానమిచ్చారు. రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే అంశం ఆయా రాష్ట్రాల ఇష్టమని స్పష్టం చేశారు.

# రాయలసీమపై వైసీపీది కపట ప్రేమ..

చెందుతుండటాన్ని చూసి వైసీపీ నేతలు నీతులు మాట్లాడుతున్నారని, వారి మాయమాటలను సీమ ప్రజలు ఇక నమ్మరని హెచ్చరించారు.

**ప్రాజెక్టులు కొట్టుకుపోతే ఏమయ్యారు?:** వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులు కొట్టుకుపోయి వందలాది కుటుంబాలు వీధిన పడినప్పుడు జగన్ రెడ్డి ఎందుకు యాత్ర చేయలేదని భూమిరెడ్డి ప్రశ్నించారు. అన్నమయ్య ప్రాజెక్టు ఎందుకు తెగిపోయిందో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ అప్పుడే తాడేపల్లి వరకు పాదయాత్ర చేసి ఉంటే ప్రజలు నమ్మేవారని అన్నారు. గోరకల్లు, అలగనూరు రిజర్వాయర్ల కట్టలు కుంగిపోయినా కనీసం మరమ్మతులకు నిధులు ఇవ్వలేదని, వీటిపై వైసీపీ నేతలు ఎందుకు పాదయాత్రలు చేయలేదని నిలదీశారు. చంద్రబాబు ప్రభుత్వం రాయలసీమ రైతుల కన్నీళ్లు తుడవడానికి ప్రయత్నిస్తుంటే, వైసీపీ నాయకులు నానాయాగీ చేస్తున్నారని విమర్శించారు.

**ఒక్క కలం పోటుతో 102 ప్రాజెక్టులకు అడ్డుకట్ట :** రాయలసీమ సమగ్రాభివృద్ధి కోసం గత టీడీపీ ప్రభుత్వం 102 ప్రాజెక్టులను మంజూరు చేస్తే, జగన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే జీఓ నంబర్ 365తో ఒక్క కలం పోటుతో ఆ ప్రాజెక్టులన్నింటినీ అడ్డుకున్నారని భూమిరెడ్డి ఆరోపించారు. దశాబ్దాలుగా తమను గెలిపిస్తున్న రాయలసీమ ప్రజలపై జగన్ రెడ్డి ఎందుకు కక్ష కట్టారని ప్రశ్నించారు. కర్నూలు పశ్చిమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులను అధికారంలోకి రాగానే ఎందుకు రద్దు చేశారని నిలదీశారు. ఆ ప్రాజెక్టులు కొనసాగించి ఉంటే ఆ ప్రాంతంలో వలసలు ఆగిపోయేవని అన్నారు.

**రాయలసీమ ఎత్తిపోతలపై జగన్ సర్కార్ ద్రోహం :** రాయలసీమ ఎత్తిపోతల పథకంపై ఇప్పుడు మాట్లాడుతున్న వైసీపీ నేతలు, వారి ప్రభుత్వ హయాంలో జరిగిన నిర్వాకాన్ని గుర్తుచేసుకోవాలని భూమిరెడ్డి హితవు పలికారు. రూ.3,825 కోట్ల అంచనాతో పథకాన్ని ప్రారంభించి, ఐదు నెలల్లోనే దొంగ బిల్లులతో రూ.950 కోట్లు స్వాహా చేశారని ఆరోపించారు. 2020 అక్టోబర్‌లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) స్టే ఇస్తే, నాలుగేళ్ల పాటు ఆ స్టేను ఎత్తివేయడానికి జగన్ ప్రభుత్వం ఎందుకు ప్రయత్నించలేదని ప్రశ్నించారు. పర్యావరణ అనుమతుల కోసం ఒక్క పత్రం కూడా 'పరివేశ్' పోర్టల్‌లో అప్‌లోడ్ చేయలేదని, ఇది రాయలసీమకు చేసిన ద్రోహం కాదా అని నిలదీశారు. అంతేకాకుండా, ఈ పథకాన్ని చెన్నై తాగునీటి అవసరాల కోసం నిర్మిస్తున్నట్లు జీఓ ఇవ్వడం రాయలసీమ ప్రజలను వంచించడమేనని అన్నారు.

**పులివెందులకు నీళ్లిచ్చింది చంద్రబాబే :** జగన్ రెడ్డి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా తన సొంత నియోజకవర్గం పులివెందులలో ఒక్క ఎకరాకు కూడా అదనంగా సాగునీరు ఇవ్వలేకపోయారని భూమిరెడ్డి విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా చంద్రబాబు నాయుడు పులివెందులకు కృష్ణా జలాలు తీసుకువచ్చి ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనతను జగన్ రెడ్డి గుర్తించాలని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం హంద్రీ-నీవా ద్వారా కృష్ణా జలాలను రాష్ట్ర సరిహద్దుల్లోని కుప్పం వరకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తోందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణకు రాబోయే రెండేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు.

**అభివృద్ధి, ఉపాధితో రాయలసీమకు కొత్త శోభ :** రాయలసీమను దేశంలోనే ప్రధాన హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు వేల కోట్ల రూపాయలతో ప్రణాళికలు సిద్ధం చేశామని భూమిరెడ్డి తెలిపారు. మదనపల్లిలో త్వరలో చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. పరిశ్రమలు, ఉపాధి అవకాశాలతో రాయలసీమకు కొత్త రూపు తీసుకువస్తున్నామని అన్నారు. జమ్మలమడుగులో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్, సత్యసాయి జిల్లాలో జెట్ ఫైటర్ల తయారీ కర్మాగారాలు, కొప్పర్తిలో ఎలక్ట్రానిక్ పరిశ్రమలు, ఓర్వకల్లులో డ్రోన్ తయారీ యూనిట్లు ఏర్పాటవుతున్నాయని వివరించారు. ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ నేతలు మళ్లీ ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టాలని చూస్తున్నారని, వారి కుట్రలు ఫలించవని హెచ్చరించారు. రైతులు కోరిన వెంటనే 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందిస్తున్నా యాత్రలు చేయడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. రాయలసీమ ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, వైసీపీ రాజకీయ ప్రచారాలను నమ్మే స్థితిలో లేరని భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

# అమెరికాకు ఆంక్షల వ్యసనం పట్టింది: ఇరాన్

వ్యసనంగా మారిందని ఎక్స్ వేదికగా ఆయన మండిపడ్డారు.

ఆంక్షలతో ఇరాన్‌ను లొంగదీసుకోవడం సాధ్యం కాదని బఘాయి స్పష్టం చేశారు. దశాబ్దాలుగా ఇలాంటి ఆంక్షలను ఎదుర్కొంటూనే ఉన్నామన్నారు. అమెరికా నేతలు ఈ చెడు అలవాటును కొనసాగిస్తే.. సంక్షోభం నుంచి గౌరవప్రదంగా బయటపడే అవకాశాలను వారే దెబ్బతీసుకుంటారని హెచ్చరించారు. మరోవైపు ఇరాన్ ప్రభుత్వం డిజిటల్ ఆస్తులు, రహస్య బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లపై ఆధారపడుతోందని స్కాట్ బెసెంట్ ఆరోపించారు. వారి అక్రమ ఆర్థిక నెట్‌వర్క్‌లను గుర్తించి ధ్వంసం చేస్తామని తెలిపారు.

**ఇరాన్ సైన్యంలో కీలక నియామకాలు :** ఇరాన్ సైన్యంలో కీలక నియామకాలు జరిగాయి. సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ ఈ మార్పులు చేశారు. మేజర్ జనరల్ అలీ అబ్దొల్లాహీని సాయుధ దళాల చీఫ్‌గా, కియుమర్స్ హైదారిని డిప్యూటీగా నియమించారు. అలాగే ఐఆర్‌జీసీ కమాండర్‌గా మేజర్ జనరల్ అహ్మద్ వాహిదీ, డిప్యూటీగా మోస్తఫా ఇజాదీ బాధ్యతలు చేపట్టారు. మొజ్తబా సుప్రీం నేతగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సైన్యంలో చేసిన తొలి కీలక నియామకాలు ఇవే కావడం గమనార్హం.

# కోకాపేటలో ట్రంప్ టవర్స్..

## 65 అంతస్తులు, 450 ఫ్లాటు

ఇవి దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఎత్తయిన టవర్లుగానూ, భారతదేశంలోనే అత్యంత ఎత్తయిన ట్రంప్ టవర్లుగానూ నిలవనున్నాయి. దీనికి సంబంధించి త్వరలో జరిగే భూమి పూజకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబ సభ్యులు హాజరుకానున్నారు. మూడేళ్లలో నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ట్రిబెకా డెవలపర్స్, ఐరా రియాల్టీ సంస్థలు వెల్లడించాయి. ముంబయికి చెందిన ట్రిబెకా డెవలపర్ ట్రంప్ బ్రాండ్‌తో నిర్మాణాలు చేపడుతోంది. ట్రంప్ టవర్స్ పేరుతో దేశంలో ఇప్పటికే 8 ప్రాజెక్టులు ప్రకటించింది. పుణె, ముంబయి, కోల్‌కతా, గురుగ్రామ్‌లో నాలుగు ప్రాజెక్టులను పూర్తి చేసింది. దక్షిణ భారతంలో తొలిసారిగా హైదరాబాద్‌లో ట్రంప్ టవర్స్‌ను నిర్మించబోతోంది.

హైదరాబాద్‌లో ఒక ప్రాజెక్ట్ చేపట్టాలని తాము ఎప్పటి నుంచో అనుకుంటున్నామని, అది ఇప్పటికి సాకారమవుతోందని ట్రిబెకా డెవలపర్ వ్యవస్థాపకుడు కల్పేశ్ మెహతా పేర్కొన్నారు. భూమి ధర మినహాయిస్తే ఈ ప్రాజెక్ట్‌కు రూ.1700-1800 కోట్లు ఖర్చవుతుందని పేర్కొన్నారు. విక్రయం ద్వారా రూ.3500 కోట్ల నుంచి రూ.4200 కోట్ల మేర ఆదాయం సమకూరొచ్చని పేర్కొన్నారు. ఈ లగ్జరీ అపార్ట్‌మెంట్లలో ఒక్కో ఫ్లాట్ ధర రూ.5 కోట్ల నుంచి ప్రారంభం అవుతుంది. 16 పెంట్ హౌస్‌ల్లో ఇప్పటికే 8 పెంట్ హౌస్‌లు విక్రయాలు పూర్తయ్యాయని, ఒక పెంట్ హౌస్‌ను గరిష్ఠంగా రూ.62 కోట్లకు విక్రయించినట్లు మెహతా వెల్లడించారు.

# ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం..

ఇటీవల 'ఎక్స్' వేదికగానూ మోదీ 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రజలను కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అది అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. దేశభక్తి, త్రివర్ణం పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' ద్వారా జాతీయ పతాకంతో ప్రజలకు మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రోత్సహిస్తున్నారు.

# సురక్షితంగా తీసుకొస్తాం..

ఈ వీడియోలు, పోస్టులు వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

ఈ విషయం తన దృష్టికి రావడంతో మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించారు. బాధితుల ఆందోళన, వేదనను తాను అర్థం చేసుకోగలనని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. "థాయ్‌లాండ్‌లో చిక్కుకున్న యువత పరిస్థితి గురించి తెలిసింది. వారి కుటుంబ సభ్యుల ఆందోళనను అర్థం చేసుకోగలను. బాధితులను సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం" అని లోకేశ్ హామీ ఇచ్చారు. తక్షణమే అధికారులతో మాట్లాడి, కేంద్ర విదేశాంగ శాఖ, సంబంధిత రాయబార కార్యాలయ అధికారులతో సమన్వయం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. బాధితుల కుటుంబ సభ్యులు తన కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ చర్యలతో బాధితులు త్వరలోనే సురక్షితంగా స్వదేశానికి తిరిగి వస్తారని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# మనలో మనం విమర్శలు చేసుకోవద్దు

ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన తరుణంలో.. మనలో మనమే విభేదాలు సృష్టించుకోవడం మిత్రధర్మానికి విరుద్ధం. ఈ పరిస్థితికి ముగింపు పలికేందుకు మూడు మిత్రపక్షాల నాయకత్వం ఉమ్మడి కార్యాచరణకు నిర్ణయం తీసుకుంది. ఇకపై తెదేపా, జనసేన, భాజపాకు చెందిన సామాజిక మాధ్యమ కార్యకర్తలు ఎవరైనా.. మిత్రపక్షాల నాయకులపై, వారి కుటుంబ సభ్యులపైనా వ్యక్తిగత విమర్శలు, దూషణలకు, పరస్పర కక్ష పూరిత ప్రచారానికి పాల్పడితే.. వారు ఏ పార్టీకి చెందిన వారైనా కఠిన చర్యలు తప్పవ"ని స్పష్టంచేసింది. "మా ప్రధాన ఉద్దేశం సూడో వ్యక్తులను గుర్తించి వారి కుట్రలను అడ్డుకోవడం. అది జరగాలంటే ముందు అసలైన అభిమానులు, కార్యకర్తలు సంయమనం పాటించాలి. అనుమానాస్పద పోస్టులు, కామెంట్లు కనిపిస్తే వెంటనే ఆవేశపడి స్పందించకుండా, పార్టీల దృష్టికి తేవాలి. వాటిపై పార్టీలు తగిన చర్యలు తీసుకుంటాయి. ఇకపై మిత్రపక్షాలపై మితిమీరిన విమర్శలు, వ్యక్తిగత దాడులు, దూషణలకు ఎవరూ పాల్పడవద్దు. సంయమనం పాటించి కూటమి ఐక్యతను బలోపేతం చేయాలి" అని సూచించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని కూడా సమర్థంగా ఎదుర్కోవాలని, ప్రజలకు వాస్తవాలను వివరించి, ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరింది.

# ఆబ్కారీ రాబడి లక్ష్యాల సాధనతో పాటు అక్రమ మద్యం నియంత్రణపై ప్రత్యేక దృష్టి..!

## అధికారులకు ఆబ్కారీ శాఖ కమిషనర్ చామకూరి శ్రీధర్ ఆదేశాలు





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, ఆగస్టు 11)

ఆబ్కారీ శాఖకు నిర్దేశించిన రాబడి లక్ష్యాలను సాధించడంతో పాటు అక్రమ మద్యం రవాణా, విక్రయాలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలను సమర్థవంతంగా అరికట్టాలని రాష్ట్ర మద్యపాన నిషేధం, ఆబ్కారీ శాఖ కమిషనర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కడప కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో మంగళవారం ఆబ్కారీ రాబడి, శాఖాపరమైన అంశాలపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ చామకూరి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, నెల్లూరు జిల్లాలకు సంబంధించిన ఆబ్కారీ శాఖ పనితీరును ఆయన సమగ్రంగా సమీక్షించారు. మూడు జిల్లాల్లో నిర్ణయించిన ఆబ్కారీ రాబడి లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతి, ఇంకా సాధించాల్సిన లక్ష్యాలపై కమిషనర్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రాబడి లక్ష్యాలను నిర్దేశిత కాలంలో సాధించేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదే విధంగా అక్రమ మద్యం రవాణా, నిల్వలు, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. సరిహద్దు ప్రాంతాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేసి అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. శాఖాపరమైన పనితీరును మెరుగుపరిచేందుకు అధికారులు తమ పరిధిలోని సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖకు సంబంధించిన పెండింగ్ అంశాలను వేగంగా పరిష్కరించి పరిపాలనా పనితీరును మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మూడు జిల్లాలకు చెందిన అధికారులు తమ పరిధిలో ఆబ్కారీ రాబడి పురోగతి, అక్రమ మద్యం నియంత్రణకు చేపట్టిన చర్యలు, శాఖాపరమైన పనితీరు తదితర అంశాలపై కమిషనర్‌కు వివరించారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన చర్యలపై కమిషనర్ వారికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో కడప డిప్యూటీ కమిషనర్ జయరాజు, నెల్లూరు డిప్యూటీ కమిషనర్ శంకరయ్య, కడప అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్‌తో పాటు వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల జిల్లా నిషేధ, ఆబ్కారీ అధికారులు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, స్టేషన్ హౌస్ అధికారులు పాల్గొన్నారు.





ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

12.08.26 బుధవారం


# 2025 మెగా డీఎస్సీ పై ఈ కుట్రలేంటి?

**కష్టపడి చదివాం... ఉద్యోగం తెచ్చుకున్నాం**

**మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీయటం న్యాయమేనా ?**

**మీరు వాలంటీర్ పోస్ట్ ఇస్తే**

**కూటమి ప్రభుత్వం టీచర్ ఉద్యోగం ఇచ్చింది**

**ఇలాగే తప్పుడు ప్రచారం చేస్తే**

**ఈ సారి 11 కూడా రావు**

**వైసిపి ఆరోపణలపై ఉపాధ్యాయుల కన్నెర్ర**

**కందుకూరులో 2025 డీఎస్సీ ఉపాధ్యాయుల ఆత్మగౌరవ ర్యాలీ**

**సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే ఇంటూరి**

మెగా డీఎస్సీ 2025కు ఎంపికైన పలువురు ఉపాధ్యాయులు వైసిపి తీరు పై తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు డీఎస్సీ కోసం ఎదురుచూసినా ఫలితంలేదని, తాను అధికారంలోకి రాగానే ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తానన్న జగన్ మాటలను నమ్మి మోసపోయామని పలువురు తమ అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా తెలియచేశారు. మెగా డీఎస్సీపై లోకేష్ యువగళం పాదయాత్రలో ప్రకటించిన తర్వాతే తమలో ఆశలు చిగురించాయని పేర్కొన్నారు. లోకేష్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ 16,300 పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించాక, తామంతా కష్టపడి చదివి ఉద్యోగాలు సంపాదించామని చెప్పారు. తీరా ఉద్యోగాలలో జాయిన్ అయ్యాక, వైసీపీ వ్యవహరిస్తున్న తీరుతో ఎంతో బాధపడుతున్నామని అన్నారు. డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించిన సంగతి వైసిపి వారికి కూడా తెలుసని, రాజకీయాల కోసం దగా డిఎస్సి అంటూ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రెండు నెలలుగా తాము మానసిక క్షోభ అనుభవిస్తున్నామని పలువురు కంటతడి పెట్టారు. వైసిపి నేతలు, సానుభూతిపరుల కుటుంబాలలో అనేకమందికి ఉపాధ్యాయ పోస్టులు వచ్చాయని గుర్తు చేస్తూ వారు కూడా డబ్బులు ఇచ్చి పోస్టు కొనుక్కున్నట్టేనా అని ఆవేశంగా ప్రశ్నించారు.




**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 11)**

2025 మెగా డిఎస్సి మీద వైసిపి తప్పుడు ప్రచారంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఉపాధ్యాయులు కదం తొక్కారు. ఎంతో కష్టపడి ఉద్యోగాలకు ఎంపికైతే, తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కుట్రలు చేస్తారా ? అంటూ వైసిపి నేతలపై కన్నెర్ర చేశారు. 2025 మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు కందుకూరులో మంగళవారం సాయంత్రం ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారు. వారికి మద్దతుగా వందలాదిగా ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రైవేటు ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, యువత, మేధావులు, వివిధ వర్గాల ప్రముఖులు, సీనియర్ సిటిజన్లు, తరలివచ్చారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాల నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ముందుగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే నాగేశ్వరరావు పూలమాలలు వేసి ర్యాలీని ప్రారంభించారు. కూటమి పార్టీల నేతలు కూడా ర్యాలీలో పాల్గొని ఉపాధ్యాయులకు సంఘీభావం తెలిపారు. ఉపాధ్యాయులతో రాజకీయాలు ఆడొద్దు, మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దు, ఉపాధ్యాయుల ఐక్యత వర్ధిల్లాలి, థాంక్యూ సీఎం సార్, థాంక్యూ లోకేష్ సార్, థాంక్యూ పవన్ కళ్యాణ్ సార్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం




డీఎస్సీకి సంబంధించి పేపర్ లీకేజీ గాని, ఎలాంటి అక్రమాలు గాని జరగలేదని పలువురు ఉపాధ్యాయులు స్పష్టం చేశారు. ప్రతి ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించారన్నారు. ఎన్నో ఏళ్లుగా తాము కంటున్న కలలు సహకారం అయ్యాయని, అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు మనస్ఫూర్తితో కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. జగన్, వైసీపీ నేతలు ఇకనైనా పద్ధతి మార్చుకుని, డీఎస్సీ పై చేస్తున్న కుట్రలకు ఫుల్ స్టాప్ పెట్టాలని ఉపాధ్యాయులు హెచ్చరించారు. ఒక దశలో వైసీపీని గొడ్డలి పార్టీ అని సంబోధిస్తూ ఇలాగే తప్పుడు ప్రచారాలు చేస్తే వచ్చే ఎన్నికల్లో 11 సీట్లు కూడా రావని, ఉపాధ్యాయుల ఉసురు తప్పక తగులుతుందని భావోద్వేగంతో మాట్లాడారు.

ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ డీఎస్సీని అడ్డుకునేందుకు వైసిపి 335 కేసులను వేసిందని గుర్తు చేశారు. అయితే ఆధారాలు లేకపోవడంతో కోర్టు వాటిని కొట్టేసిందన్నారు. మంత్రి లోకేష్ సారథ్యంలో డీఎస్సీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, నిరుద్యోగులకు న్యాయం చేశారని కొనియాడారు. స్వర్గీయ ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలో 13 సార్లు డీఎస్సీ నిర్వహించి లక్ష మందికి పైగా ఉపాధ్యాయులను ఎంపిక చేసిన రికార్డును ఎవరు చెరిపి వేయలేరని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. 2025 మెగా డీఎస్సీ ద్వారా 16 వేలకు పైగా పోస్టులు భర్తీ చేస్తే, జగన్ అండ్ కో కొత్త నాటకాలకు తెరతీసిందన్నారు. మిగతా 4లో

# తల్లీబిడ్డల ఆరోగ్యానికి మరింత భరోసా

**నూతన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ప్రారంభం**

**పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం**

**అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

**ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**

4



# గ్రీవెన్స్ అర్జీల నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలి

**ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి**

**సాయి ప్రసాద్, సీసీఎల్ఏ అధికారిణి జయలక్ష్మి**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 11)**

గ్రీవెన్స్ అర్జీల నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీసీఎల్ఏ అధికారిణి జయలక్ష్మి సూచించారు. మంగళవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీసీఎల్ఏ జయలక్ష్మి అన్ని జిల్లాల కలెక్టర్లతో సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్.ఓ.ఆర్, అసైన్మెంట్స్, రీ సర్వే, పట్టాదారు పాస్ పుసకాల పంపిణీ, పిజిఆర్ఎస్, భూముల మెడిటేషన్ 22ఏ సమస్యల పై జిల్లాల వారీగా సమీక్షించారు. ఒంగోలు కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ పి రాజా బాబు పాల్గొన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా చర్చించారు. గ్రీవెన్స్ అర్జీల నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కలెక్టరేట్ నుంచి సంబంధిత ఆర్డీవోలు, సబ్ కలెక్టర్ కార్యాలయానికి అర్జీలను పంపించాలని ఆదేశించారు. భూములు రీ సర్వే ప్రక్రియను ఎన్ని మండలాలు పూర్తి చేశారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిగిలిన మండలాల్లో రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేసి పకడ్బందీగా నిర్వహించాలని ఆయన సూచించారు. 4లో

# మత్స్యకారులు, ఆక్వా రంగానికి కూటమి ప్రభుత్వం పూర్తి అండ

**మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**




**(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, ఆగస్టు 11)**

సముద్రంలో వేటకు వెళ్లే ప్రతీ మత్స్యకారుడి ప్రాణ రక్షణ, వారి కుటుంబాల ఆర్థిక అభ్యున్నతే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండలో మత్స్యకారుల రక్షణార్థం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ట్రాన్స్‌పాండర్లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మిగతా 4లో

# గానుగపాలెంలో మహిళ అనుమానాస్పద మృతి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 11)**

ఒంగోలు నగరంలోని గానుగపాలెంలో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసుల వివరాల ప్రకారం పొదిలి ప్రాంతానికి చెందిన షేక్ మొబీనా (25) కొంతకాలంగా గానుగపాలెంలో నివాసం ఉంటోంది. మైనంపాడు గ్రామానికి చెందిన ఎబినేజర్ (30) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరికీ సుమారు ఏడాది క్రితం మైనంపాడులోని డిఈడీ కళాశాలలో మహిళ చదువుతున్న సమయంలో ఆటోలో వెళుతూ పరిచయం మిగతా 4లో

# 2025 మెగా డీఎస్సీ పై ఈ కుట్రలేంటి?

వైసిపి ఎంత గోలచేసినా కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. ఈ ఏడాదిలోనే మరో డీఎస్సీని ప్రకటించబోతున్నారని తెలిపారు. ఆత్మగౌరవ ర్యాలీకి తరలివచ్చిన ఉపాధ్యాయులందరికీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలుపుతూ ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ప్రకటించారు. తన గెలుపులోను ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ యూనియన్ల ప్రతినిధులు, కూటమి పార్టీల నేతలు, వివిధ సామాజిక వర్గాల మేధావులు పాల్గొన్నారు.





# మత్స్యకారులు, ఆక్వా రంగానికి కూటమి ప్రభుత్వం పూర్తి అండ





ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా శాటిలైట్ ట్రాన్స్‌పాండర్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ పరికరాలను బోట్లలో ఉంచుకోవడం వల్ల సముద్రంలో ఏదైనా ప్రమాదం జరిగినా, ప్రతికూల వాతావరణం లేదా తుఫాను హెచ్చరికలు ఉన్నా, బోటు ప్రమాదవశాత్తూ పక్క దేశాల జలాల్లోకి వెళ్తున్నా బ్లూటూత్ ద్వారా మత్స్యకారుల స్మార్ట్‌ఫోన్‌లకు తక్షణ అలెర్టు వస్తాయన్నారు. అత్యవసర సమయాల్లో మత్స్యకారులు ఎస్.ఓ.ఎస్ సందేశాలను కంట్రోల్ రూమ్‌కు పంపి తమ ప్రాణాలను రక్షించుకోవచ్చని ఆయన వివరించారు. దీనికి తోడు వేటకు వెళ్లే ప్రతీ ఒక్కరికీ త్వరలోనే నాణ్యమైన లైఫ్ జాకెట్లను కూడా ప్రభుత్వం పంపిణీ చేయనుందని స్పష్టం చేశారు. మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్న మంత్రి, వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో రూ. 20,000 ల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని చెప్పారు. అలాగే వారి కష్టాన్ని గుర్తించి 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేస్తుండటంతో పాటు, సబ్సిడీపై వలలు, బోట్లు అందజేస్తున్నామన్నారు. సముద్రంలో వేటకు వెళ్లి దురదృష్టవశాత్తూ అదృశ్యమైన మత్స్యకారుల కుటుంబాలకు వేగంగా డెత్ సర్టిఫికెట్లు ఇప్పించి, వారి కుటుంబాలకు తక్షణమే పింఛన్ మరియు ప్రమాద సహాయాన్ని అందిస్తున్నామని మంత్రి తెలిపారు. మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీని సులభతరం చేసేందుకు ప్రత్యేకంగా డీజిల్ బంకుల ఏర్పాటుకు కూడా అనుమతులు తెస్తున్నట్లు వెల్లడించారు. మౌలిక వసతుల కల్పనపై మాట్లాడుతూ, సింగరాయకొండ ప్రాంత మత్స్యకారుల సౌకర్యార్థం నూతనంగా ఆధునిక చేపల మార్కెట్‌ను నిర్మించనున్నామని మంత్రి చెప్పారు. అలాగే ఈ ప్రాంతంలో నివసించే యానాది సామాజిక వర్గానికి అన్ని వసతులతో కూడిన శాశ్వత నివాస సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని మరియు మత్స్య పరిశ్రమను మరింత బలోపేతం చేసేందుకు విశాఖపట్నం, భీమవరం ప్రాంతాలలో ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నామని, విశాఖ తీరంతో పాటు రాష్ట్రంలోని బీచ్‌లను పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. పేద ప్రజలు, పేదల ఆకలి తీర్చడానికి కూటమి ప్రభుత్వం రూ. 5 లకే కడుపునిండా పౌష్టికాహారాన్ని ఇచ్చే అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించిందని ఆయన కొనియాడారు. మత్స్యకార సోదరుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో తాను ఎల్లప్పుడూ మీకు తోడు ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు.

# తల్లీబిడ్డల ఆరోగ్యానికి మరింత భరోసా

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 11)**

తల్లీబిడ్డల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పించేలా నూతన తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రారంభించడం సంతోషంగా ఉందని మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నూతన వాహనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ. శ్రీనివాసులు, జిల్లా డీఎంహెచ్ఓ, ఇతర అధికారులు పాల్గొన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అత్యవసర సమయంలో సురక్షితమైన, వేగవంతమైన ఉచిత రవాణా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువయ్యేలా ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ సేవలకు ఆధునిక సాంకేతికతను జోడించి మరింత సమర్థవంతంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి తల్లి, ప్రతి బిడ్డ ఆరోగ్యంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి తల్లి ఆరోగ్యంగా.. ప్రతి బిడ్డ సురక్షితంగా ఉండేలా ప్రభుత్వ ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేస్తామని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ ఎం విజయసునీత మార్కాపురం జిల్లా ప్రజారోగ్య సంరక్షణలో భాగంగా ఈ ఉచిత రవాణా వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలను పరిష్కరించడంతో పాటు, ప్రసవానంతర సంరక్షణను మెరుగుపరచడం ఈ సేవల ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను రక్తం ఎక్కించడం (బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్) కోసం ఆసుపత్రులకు సురక్షితంగా తరలించడానికి ఈ వాహనాలను వినియోగిస్తామని వెల్లడించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలను, నవజాత శిశువులను పూర్తి ఉచితంగా, సౌకర్యవంతంగా, సురక్షితంగా వారి ఇళ్లకు చేర్చవచ్చని పేర్కొన్నారు. నూతనంగా అందుబాటులోకి వచ్చిన ప్రతీ వాహనంలో ప్రయాణికుల భద్రత కోసం 6 ఎయిర్ బ్యాగ్‌లు, అత్యవసర సమయంలో సాయం పొందేలా ఎమర్జెన్సీ బటన్, ఫైర్ సేఫ్టీ సిస్టమ్, జీపీఎస్ లొకేషన్ ట్రాకింగ్, చైల్డ్ లాక్, రివర్స్ పార్కింగ్ సెన్సార్లు వంటి ఆధునిక సాంకేతిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సుజన, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇన్‌చార్జ్ అధికారి డాక్టర్ మనస్సే, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రాహుల్, డిపిఎంఓ డాక్టర్ జగదీష్, జిల్లా సర్వేలన్స్ అధికారి డాక్టర్ యాగ్నిక్, జిల్లా ఎపిడెమియాలజిస్ట్ డాక్టర్ రోహిత్ నాయక్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ అర్జీల నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలి



పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో పురోగతి పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పిజిఆర్‌యస్ కి సంబంధించి వచ్చిన ఆర్జీలను పరిశీలించి రెవిన్యూ, భూ సమస్యలు, ఫ్యామిలీ సంబందిత సమస్యలు లాంటివి విడివిడిగా చేసి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అవరమైన చర్యలు తీసుకోవాలని, అదే విధంగా వచ్చిన అర్జీలను తిరస్కరించకుండా పరిష్కరించే విధంగా తీసుకోవాలన్నారు. ఈ వీడియో పిజిఆర్ఎస్ పర్యవేక్ష, భూ విభాగ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గానుగపాలెంలో మహిళ అనుమానాస్పద మృతి

ఏర్పడినట్లు సమాచారం. వీరికి వివాహం జరగకపోయినప్పటికీ గానుగపాలెంలో కలిసి నివసిస్తున్నట్లు తెలిసింది. మంగళవారం ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా మొబీనా ఇంట్లో ఉరివేసుకున్న స్థితిలో మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహం నాలుగు, ఐదు రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఇంటి లోపల నుంచి గడియ వేసి ఉండటంతో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఎబినేజర్‌కు ఇంటి యజమాని ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదని సమాచారం. ఇద్దరి మధ్య ఏమైనా వివాదం జరిగిందా, లేక ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పేద కుటుంబాలకు అండగా కూటమి ప్రభుత్వం

## టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మంచూరు సూర్యనారాయణరెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఆగస్టు 11)**

పేద కుటుంబాలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి మంజూరు సూర్యనారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని కలసపాడు, శ్రీ అవధూత కాశీనాయన మండలాలకు చెందిన 8 మంది లబ్ధిదారులకు రూ.2,52,813 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నియోజకవర్గ ఇన్‌ఛార్జి మంచూరు సూర్యనారాయణరెడ్డి, బద్వేలు నియోజకవర్గ పరిశీలకులు తుగ్గలి నాగేంద్రతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని తెలిపారు. అనారోగ్యంతో వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఇంచార్జి తెలిపారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, తన వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి సూర్యనారాయణరెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ ఓబుళాపురం రాజశేఖర్, చెరుకూరి రవికుమార్, కొత్తకోట పిఏసిఎస్ చైర్మన్ కల్లూరి దుగ్గిరెడ్డి, చంద్రగిరి ప్రహ్లాద్‌రెడ్డి, సిమాంక్ హాస్పిటల్ డైరెక్టర్ జహంగీర్ భాష, మాచుపల్లి క్రిష్ణరెడ్డి, బద్వేలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కలసపాడు, శ్రీ అవధూత కాశినాయన మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# భారతస్వాతంత్ర్యానికి గుర్తుగా హర్ ఘర్ తిరంగా జెండాను అందరూ ఇండ్ల పై ఎగురవేయాలి

## ప్రధానోపాధ్యాయుడు ఎస్ కె మౌలాలి






**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఆగస్టు 11)**

మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీ, లింగారెడ్డి కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ కె మౌలాలి మాట్లాడుతూ మన జాతీయ పతాకం దేశానికి గర్వకారణమన్నారు. త్రివర్ణపతాకం మనకు నిరంతరం ప్రేరణ కలిగించే శక్తి అన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 9వ తేదీ నుండి 17వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. అందులో భాగంగా మంగళవారం ఈ పాఠశాలలో కార్యక్రమం ప్రారంభించామన్నారు. అంతే కాక హర్ఘర్ తిరంగా భారతదేశ స్వాతంత్ర్యానికి గుర్తుగా ప్రజలు త్రివర్ణపతాకాన్ని తమ ఇండ్ల పై ఎగురవేయడాన్ని ప్రోత్సహించేందుకు, హర్ఘర్, తిరంగాలి కార్యక్రమం ప్రారంభమయినదని అన్నారు. ప్రజలహృదయాలలో దేశభక్తి భావనను పెంపొందించడం, భారత జాతీయ పతాకం పై అవగాహన కల్పించడం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. మన జాతీయ పతాకం దేశానికి గర్వకారణం. త్రివర్ణపతాకం మన నిరంతర ప్రేరణ శక్తి అని హర్ ఘర్ తిరంగా 2026 వందే మాతరం స్ఫూర్తికి అంకితం చేయబడిందన్నారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నిర్వహించే హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని త్రివర్ణపతాకంతో సెల్ఫీతో హర్ ఘర్ తిరంగా పోర్టల్‌లో అప్లోడ్ చేసి ప్రశంసా పత్రం పొందవచ్చని హర్ ఘర్ తిరంగా కార్యక్రమం వాలంటీర్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత షేక్ మౌలాలి, విద్యార్థులకు, గ్రామస్తులకు తెలిపారు.

## ఇంటింటికీ ప్రభుత్వం చేసిన మేలు
## ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 11)
తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్న ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పెద్ద నాగులవరం గ్రామంలో ఇంటింటికీ పర్యటించి ప్రజలను కలిసి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, సూపర్ సిక్స్ హామీల అమలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని సందర్శించిన ఎమ్మెల్యే ప్రజల సమస్యలు, సూచనలు తెలుసుకుని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకోవడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సూపర్ సిక్స్ హామీలపై విస్తృత అవగాహన కల్పిస్తూ ప్రతి ఇంటికీ ప్రభుత్వ విజయాలను తీసుకెళు న్నామని తెలిపారు. ప్రజల నుంచి లభిస్తున్న సానుకూల స్పందన ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమరావతి ఛాంపియన్‌షిప్‌కు వనిపెంట బీసీ గురుకుల విద్యార్థినుల ఎంపిక



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 11)
అమరావతి ఛాంపియన్‌షిప్ అండర్ 23 వాలిబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు మైదుకూరు మండలం వనిపెంట మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలకు పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎస్ గాయత్రి, కె చిట్టి, వై గురునందిని ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రిన్సిపల్ నిర్మల, పీఈటీ శైలజ, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులను అభినందించిన పాఠశాల సిబ్బంది రాష్ట్రస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థినుల ప్రతిభ పాఠశాలకు గర్వకారణమని, రాష్ట్రస్థాయిలో రాణించి బీసీ గురుకుల పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

## స్వాతంత్ర్య దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో ప్రజా భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలి
## జిల్లా కలెక్టర్ పి రాజా బాబు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 11)
దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ముందస్తుగా అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ పి రాజాబాబు పిలుపునిచ్చారు. మంగళవారం ప్రకాశం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం అధికారిక వేడుకగానే కాకుండా ప్రజా భాగస్వామ్యంతో ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మన పూర్వీకులు, స్వాతంత్ర్య సమరయోధుల అపార త్యాగాల ఫలితంగానే నేడు మనకు ఈ స్వేచ్ఛ, ఆత్మగౌరవం లభించాయని, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు దేశం సాధించిన మైలురాళ్లను స్మరించుకుంటూ రాబోయే తరాలకు ఈ స్ఫూర్తిని అందించడమే దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. "వికసిత భారత్-2047" లక్ష్య సాధనలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని ఆయన కోరారు. ఐఏఎస్ అధికారులు, వైద్యులు, ఇంజనీర్లు, వ్యాపారవేత్తలు, సామాజిక కార్యకర్తల నుండి విద్యార్థుల వరకు ప్రతి ఒక్కరూ తాము దేశాభివృద్ధికి ఏ విధంగా సేవ చేస్తారో వివరిస్తూ స్వచ్ఛందంగా సెల్ఫీ వీడియోలు తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలు, యువత, విద్యార్థులు, పౌర సమాజం, సాధారణ ప్రజలందరూ పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# బద్వేల్లో ఘనంగా ఆర్యవైశ్య జిల్లా కమిటీ విజయోత్సవ సమావేశం

## కమిటీ సభ్యుల సహకారంతో విజయవంతంగా ప్రమాణ స్వీకారం
## హర్షం వ్యక్తం చేసిన జిల్లా కమిటీ సభ్యులు





(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఆగస్టు 11)
ఈ నెల 9వ తేదీ ఆదివారం బద్వేల్ పట్టణంలో అత్యంత వైభవంగా, విజయవంతంగా జరిగిన కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన జిల్లా కమిటీ కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ విజయోత్సవ సమావేశంను మంగళవారం సాయంత్రం బద్వేల్‌లోని వాసవి అపార్ట్‌మెంట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సంఘం ముఖ్య నాయకులు, నూతన కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విజయోత్సవ సమావేశంలో భాగంగా, ప్రమాణ స్వీకార మహోత్సవం దిగ్విజయంగా పూర్తవ్వడానికి అహర్నిశలు కృషి చేసి, సహకరించిన ప్రతి ఒక్కరికీ నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి సివి నాగేశ్వరరావు, ట్రెజరర్ పబ్బతి చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలిశెట్టి ప్రసాద్, గౌరవాధ్యక్షులు పివిఎన్ ప్రసాద్, కెవి సుబ్బారావు మాట్లాడుతూ సమాజ సేవలో ఆర్యవైశ్య సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని, నూతన కమిటీ ద్వారా మున్ముందు మరిన్ని సంక్షేమ, సేవా కార్యక్రమాలను వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ విజయోత్సవ సమావేసంలో కడప జిల్లా ఆర్యవైశ్య సంఘంలో వివిధ హోదాలు, పదవులు చేపట్టిన బాధ్యులతో పాటు పలువురు కమిటీ సభ్యులు, వైశ్య ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నాయకులందరూ ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఐక్యమత్యంతో సంఘాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా సభ్యులందరూ పునరుద్ఘాటించారు. ప్రమాణస్వీకారం మహోత్సవంలో సమిష్టి క్రీస్తు ప్రతి ఒక్కరు అక్కడ జరుగుతున్నటువంటి కార్యక్రమాల్లో పాలుపంచుకొని రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఈ కార్యక్రమం విజయవంతంగా జరగడానికి సహకరించిన వారందరికీ కూడా జిల్లా కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్న పలువురికి చాలా అద్భుతంగా వంటలు చేయించిన బాలాజీ డెకరేషన్, క్యాటరింగ్ యజమాని పొట్లదుత్తి రమేష్, పిఆర్ స్టూడియో సురేంద్రలను జిల్లా కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్య వైశ్యులు జిల్లా కమిటీ సభ్యులు మహిళా మండలి యువజన సంఘం వారు పాల్గొన్నారు.





# జైలు క్వార్టర్స్ సమీపంలో చెట్లకు నిప్పు భయాందోళనకు గురైన కుటుంబాలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 11)
ఒంగోలు భాగ్యనగర్‌లోని 11వ క్రాస్ రోడ్డులో జైలు క్వార్టర్స్‌ను ఆనుకుని ఉన్న చెట్లకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. మంటలు ఒక్కసారిగా పెద్ద ఎత్తున వ్యాపించడంతో జైలు క్వార్టర్స్‌లో నివసిస్తున్న కుటుంబాలు భయాందోళనకు గురయ్యాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది స్పందించడంతో మంటలు క్వార్టర్స్‌కు వ్యాపించకుండా నివారించారు. ఘటన పై సంబంధిత అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.





# విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్ఐ




(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, ఆగస్టు 11)
ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న వారపు కార్యక్రమాల్లో భాగంగా వేటపాలెం మండలం దేశాయిపేట హైస్కూల్‌లో మంగళవారం వేటపాలెం ఎస్ఐ జనార్ధన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాల పై అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వం నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులతో కలిసి ఎస్ఐ భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందుతున్న తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంత్యక్రియల నిర్వహణ నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 11)
పట్టణంలోని ముత్యాలకుంట పార్కువద్ద హిందూస్మశాన వాటికలో పట్టణానికి చెందిన ప్రముఖ ఆర్యవైశ్యుడు, జ్యువెలర్స్ అధినేత వేములసుకుమార్ గుప్తా సొంత నిధులతో అంత్యక్రియలు నిర్వహించే భవనాన్ని కొత్తగా నిర్మించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆ భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. అందరికీ ఉపయోగపడేలా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుకుమార్ ను అభినందించారు. మున్సిపల్ కమిషనర్ కే అనూష, ఆర్యవైశ్య నాయకులు చీదెళ్ల వేణుగోపాల్, గుర్రం అల్లూరయ్య, మురారిశెట్టి సుధీర్, చీదెళ్ల పిచ్చయ్య, గుర్రం చిన్న అల్లూరయ్య, పెట్లూరి సుబ్బారావు, వలేటి వెంకటేశ్వర్లు, యోగేశ్వరరావు, భవనాసి వెంకటేశ్వర్లు, మచ్చా మనోహర్, గుమ్మా శివ, రాధాకృష్ణ, నందనవనం రాము, రెబ్బవరపు మాల్యాద్రి, చనమాల శ్రీధర్, సవిడి బోయిన వెంకటకృష్ణ, చల్లా మహేంద్ర, షేక్ ఫిరోజ్, నూకల సుబ్బారావు, పీలా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.







# ఆక్వా రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం



**జోన్, నాన్‌జోన్ పరిమితి లేకుండా రూ.1.50కే యూనిట్ విద్యుత్**
**రైతుల సమక్షంలోనే జీవో నెం.57 విడుదల**
**ఆక్వా రంగం సీఎం చంద్రబాబు మానస పుత్రిక**
**బ్లూ ఎకానమీలో ఏపీని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతాం**
**26 నెలల్లో 99 శాతం ఎన్నికల హామీల అమలు**
**రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**(షణ్ముఖ వెలుగు, శ్రీకాకుళం, ఆగస్టు 11)**

ఆక్వా రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన మరో కీలక హామీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులతో కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. జోన్, నాన్‌జోన్‌తో సంబంధం లేకుండా, పదెకరాల పరిమితి లేకుండా అర్హులైన ప్రతి ఆక్వా రైతుకూ యూనిట్ విద్యుత్‌ను రూ.1.50 కి అందించేందుకు జీవో నెం.57ను రైతుల సమక్షంలోనే విడుదల చేయడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. పాలకొల్లులో వేలాది మంది ఆక్వా రైతుల సమక్షంలో నిర్వహించిన భారీ సభలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రి గొట్టిపాటి రవికుమార్, శాసనసభ ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, మాజీ మంత్రులు పితాని సత్యనారాయణ, కామినేని శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, శాసనమండలి సభ్యులు, సోము వీర్రాజు, కార్పొరేషన్ ఛైర్మన్లు, రైతు సంఘాల నాయకులు, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ఆక్వా రైతులు, పాత్రికేయులకు పేరుపేరునా అభినందనలు తెలిపారు.

### వెంటిలేటర్ నుంచి ఆక్సిజన్ తీసుకునే స్థాయికి రాష్ట్రం

2024 ఎన్నికలు కురుక్షేత్ర సంగ్రామంలా జరిగాయని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు నిండు హృదయంతో ఆశీర్వదించి ఎన్డీఏ కూటమిని అధికారంలోకి తీసుకొచ్చారని అచ్చెన్నాయుడు అన్నారు. ఆగస్టు 12తో కూటమి ప్రభుత్వానికి 26 నెలలు పూర్తవుతున్నాయని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయని విమర్శించారు. అధికారంలోకి వచ్చినప్పుడు ఆనందం కంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చూసి భయమే ఎక్కువగా కలిగిందన్నారు. ప్రతి శాఖలో అప్పులే కనిపించాయని, ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు సకాలంలో ఇవ్వలేని పరిస్థితి నుంచి పాలన ప్రారంభించాల్సి వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు లాంటి నాయకుడు ఉండటం ఐదు కోట్ల మంది ప్రజల అదృష్టం. ఆయనకు పవన్ కళ్యాణ్ సహకారం, కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందిస్తున్న సహాయంతో 26 నెలల్లో వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని ఆక్సిజన్ తీసుకునే స్థాయికి తీసుకొచ్చాం. ఇప్పటికీ ఆర్థిక ఇబ్బందులున్నా ప్రజల కష్టం తెలిసిన ముఖ్యమంత్రిగా ఇచ్చిన మాటకు కట్టుబడి చంద్రబాబు అహర్నిశలు పనిచేస్తున్నారు అని మంత్రి పేర్కొన్నారు.

### 26 నెలల్లో 99 శాతం హామీల అమలు

దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా కేవలం 26 నెలల్లో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 99 శాతం హామీలను అమలు చేశామని అచ్చెన్నాయుడు అన్నారు. పెన్షన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచడంతో పాటు వివిధ కేటగిరీలకు రూ.6 వేలు, రూ.10 వేలు, రూ.15 వేల వరకు అందిస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేల ఆర్థిక సాయం, తల్లికి వందనం కింద చదువుకునే పిల్లలకు రూ.15 వేలు, మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, ఆటో డ్రైవర్లకు రూ.20 వేలు, చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేల సాయం అందిస్తున్నామని వివరించారు. ఎన్నికల్లో హామీ ఇవ్వని అనేక కార్యక్రమాలను కూడా అమలు చేస్తున్నామన్నారు.

### రూ.724 కోట్ల నుంచి రూ.1,150 కోట్లకు విద్యుత్ సబ్సిడీ

ఆక్వా రైతులకు ఇచ్చిన హామీలో భాగంగా జోన్, నాన్‌జోన్, పదెకరాల పరిమితితో సంబంధం లేకుండా రూ.1.50 యూనిట్ విద్యుత్ అందిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఈ రంగంపై సుమారు రూ.724 కోట్లు ఖర్చు చేస్తే, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో విద్యుత్ సబ్సిడీకి రూ.1,150 ఖర్చు చేసిందని తెలిపారు. ఈరోజు మేము కష్టపడి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో జీవో తీసుకొచ్చి రైతుల ముందే విడుదల చేశాం. చేసిన మంచిని ప్రజలకు చెప్పుకోవాలి. పనిచేసే ప్రభుత్వాన్ని రైతులు ఆశీర్వదించాలి అని అచ్చెన్నాయుడు కోరారు.

### ఆక్వా రంగం చంద్రబాబు మానస పుత్రిక

దేశం, ప్రపంచం ఇప్పుడు బ్లూ ఎకానమీ గురించి మాట్లాడుతోందని, ఇచ్ఛాపురం నుంచి తడ వరకు ఉన్న సుదీర్ఘ



తీరప్రాంతం ఆంధ్రప్రదేశ్‌కు ప్రకృతి ఇచ్చిన వరమని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం సరైన ప్రోత్సాహం అందిస్తే ఆక్వా, మత్స్య రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు తిరుగుండదన్నారు. 2014 లో తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో ఆక్వా రంగం వృద్ధిరేటు కేవలం 2 నుంచి 3 శాతం ఉండేదని, రైతులకు రూ.2కే విద్యుత్ అందిస్తూ రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో 2019 నాటికి 15.9 శాతం వృద్ధిరేటు సాధించిందని గుర్తుచేశారు. "ఆక్వా రంగం చంద్రబాబు నాయుడి మానస పుత్రిక. ఈ రంగాన్ని బతికించడమే కాదు.. దేశానికే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటాను" అని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

### ఆక్వా సంక్షోభంపై చేతులు ముడుచుకుని కూర్చోలేదు

విదేశాల్లో తీసుకునే నిర్ణయాలు, ఫీడ్ ధరల పెరుగుదల, విద్యుత్ వ్యయం, ఆక్వా ఉత్పత్తుల ధరలు పడిపోవడం, ఎగుమతుల్లో ఇబ్బందులు వంటి సమస్యలు రంగాన్ని ప్రభావితం చేస్తున్నాయని మంత్రి తెలిపారు. అయితే ధరలు పడిపోయాయని ప్రభుత్వం ఇంట్లో కూర్చోలేదని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అమెరికాకు వెళ్లే భారతీయ రొయ్యలపై భారీగా టారిఫ్‌లు విధించడంతో ఆక్వా రంగంపై తీవ్ర ప్రభావం పడుతుందనే ఆందోళన ఏర్పడినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా దృష్టి సారించి రైతులకు ధైర్యం ఇచ్చారని పేర్కొన్నారు. సవాళ్ల మధ్య కూడా 16 శాతం వృద్ధి తగ్గకుండా రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టామన్నారు. రైతులు, పారిశ్రామికవేత్తలను ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర మంత్రుల సమావేశాల్లోనే కూర్చోబెట్టి సమస్యలను నేరుగా వివరించే అవకాశం కల్పించామని అచ్చెన్నాయుడు తెలిపారు. "మీ సమస్యలను మీరే చెప్పండి.. పరిష్కారం చూపుతాం అని రైతులను కేంద్ర మంత్రుల ముందే కూర్చోబెట్టిన ప్రభుత్వం ఎన్డీఏ ప్రభుత్వం" అన్నారు.

### ఫీడ్ ధరలపై ఇష్టానుసారం నిర్ణయాలకు ఇక అవకాశం లేదు

ఆక్వా ఫీడ్ ధరల నియంత్రణ కోసం రైతులు, పరిశ్రమల ప్రతినిధులు, సంబంధిత వర్గాలతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. ఇకపై ధరలు పెంచాలన్నా, తగ్గించాలన్నా కమిటీ పరిశీలన, సంబంధిత వర్గాల ఆమోదంతోనే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ధరలు పెరిగాయని ఇష్టానుసారంగా పెంచడం, ముడిసరుకుల ధరలు తగ్గినప్పుడు ఫీడ్ ధరలు తగ్గించకుండా ఉండటం భవిష్యత్తులో జరగదన్నారు. 2019లో చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయే సమయానికి ఆక్వా ఫీడ్ ధర కిలో రూ.87 ఉండగా, వైసీపీ పాలనలో రెండేళ్లలో ఆరుసార్లు, సుమారు 27 శాతం పెంచి రూ.110కు తీసుకెళ్లారని విమర్శించారు. అప్పట్లో ఫిష్ ఆయిల్, ఫిష్ ఫీడ్, సోయా వంటి ముడిసరుకుల ధరల్లో అంతటి పెరుగుదల లేకపోయినా ఫీడ్ ధరలను పెంచారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీడ్ ధరలను రూ.5 తగ్గించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అనంతరం అంతర్జాతీయ మార్కెట్‌లో ఫిష్ ఆయిల్, ఫిష్ ఫీడ్, సోయాబీన్ ధరలు భారీగా పెరిగినప్పటికీ ఆ భారమంతా రైతులపై పడకుండా నియంత్రించేందుకు ప్రయత్నించామన్నారు. పరిశ్రమలు మూతపడితే మొత్తం ఆక్వా రంగమే కుదేలవుతుందనే అంశాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు, పరిశ్రమలు రెండింటి ప్రయోజనాలను కాపాడేలా నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు.

### ట్రాన్స్‌ఫార్మర్ల సబ్సిడీ తొలగించింది వైసీపీనే

2014-19 మధ్య తమ ప్రభుత్వ హయాంలో ఆక్వా రైతులకు తక్కువ వ్యయంతో ట్రాన్స్‌ఫార్మర్లు అందించామని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రాన్స్‌ఫార్మర్ల సబ్సిడీని తొలగించి రైతులపై భారం మోపిందని విమర్శించారు. ఇప్పుడు అదే పార్టీ ఆక్వా రైతులపై ప్రేమ ఉన్నట్లు మాట్లాడటం విడ్డూరమన్నారు.

### ఆక్వా యూనివర్సిటీని గాడిలో పెడుతున్నాం

ఆక్వా యూనివర్సిటీ పరిస్థితిపైనా మంత్రి స్పందించారు. గత ప్రభుత్వం యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు గొప్పగా ప్రకటించినప్పటికీ సరైన మౌలిక వసతులు కల్పించలేదని విమర్శించారు. ఒకచోట ఒక క్లాస్, మరోచోట మరో క్లాస్ నిర్వహించే పరిస్థితి ఏర్పడిందన్నారు. యూనివర్సిటీ నిర్మాణ పనుల్లో సుమారు రూ.30 కోట్ల బకాయిల సమస్య తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఎదురైందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ మొదటి, రెండో సంవత్సరాల్లో ప్రాధాన్యం ఇచ్చి సుమారు రూ.27 కోట్ల పాత బకాయిలను కాంట్రాక్టర్లకు చెల్లించి, పనులను తిరిగి ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

### సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేసింది గత ప్రభుత్వమే

2014-19 మధ్య సాగునీటి రంగానికి సుమారు రూ.57 వేల కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలోని ప్రాజెక్టులను శరవేగంగా ముందుకు తీసుకెళ్లామని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. 2019 తర్వాత ఐదేళ్లలో సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, ఒక్క ప్రాజెక్టును పూర్తి చేసి కొత్తగా ఒక్క ఎకరాకు నీరందించిన దాఖలాలు లేవని విమర్శించారు. ఈ ప్రాంతానికి వరప్రదాయిని అయిన పోలవరం ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు.

### వైసీపీ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దు

గత ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలను పట్టించుకోని వైసీపీ నాయకులు అధికారం కోల్పోయిన తర్వాత ప్రతి అంశాన్నీ సమస్యగా చూపిస్తూ ప్రభుత్వంపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారని అచ్చెన్నాయుడు మండిపడ్డారు. భీమవరంలో ఆక్వా రైతులతో ముఖాముఖి పేరుతో కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వంపై విమర్శలు చేసి వెళ్లిపోయారని అన్నారు. దేవరపల్లి పర్యటన సందర్భంగా జరిగిన ఘటనలను కూడా ప్రస్తావిస్తూ రాజకీయ పర్యటనల్లో చోటుచేసుకునే అవాంఛనీయ ఘటనలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. "వారు ఒకటి మాట్లాడితే వాస్తవాలతో పది సమాధానాలు చెబుతాం. పది మాట్లాడితే ఇరవై వాస్తవాలు ప్రజల ముందుంచుతాం. పనిచేస్తున్న ప్రభుత్వంపై అబద్ధాలు చెబితే చూస్తూ ఊరుకోం" అని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు రాజకీయ ప్రచారాలకు ప్రభావితం కాకుండా ప్రభుత్వ పనితీరును బేరీజు వేసుకోవాలని కోరారు. చంద్రబాబు నాయుడు నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి దేశ, ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందారని, తాను ఆరుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించానని పేర్కొన్నారు. రాజకీయ అస్థిరత వల్ల వ్యక్తిగతంగా నాయకులకు కంటే నష్టపోయేది సామాన్య ప్రజలు, రాష్ట్ర భవిష్యత్తేనని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం మీదే. కష్టాలున్నాయి.. ఆర్థిక ఇబ్బందులున్నాయి. కానీ ప్రజలకు మంచి చేయాలనే మనసుంది, రాష్ట్రానికి సంపద సృష్టించే శక్తి ఉంది. మనిషి మనిషికి, కుటుంబం కుటుంబానికి వాస్తవాలు చెప్పాలి. రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించాలి అని అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధిలో మళ్లీ 'వైకుంఠపాళి ఆట' ఆడకూడదని మంత్రి వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం ఇటుక మీద ఇటుక పేర్చి రాష్ట్రాన్ని నిర్మిస్తుంటే, తప్పుడు ప్రచారాలను నమ్మి మళ్లీ మొదటి మెట్టుకు తీసుకెళ్లే పరిస్థితి రావద్దన్నారు. అలాంటి పరిస్థితి వస్తే నష్టం ప్రస్తుత తరానికే కాకుండా మన పిల్లలకు, రాష్ట్ర భవిష్యత్తుకు జరుగుతుందని హెచ్చరించారు. ఆక్వా రైతులకు 1.50 కి యూనిట్ విద్యుత్ అందించే జీవోను సాధించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూర్తి సహకారం అందించారని అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సాధారణ సమావేశంలా కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది రైతులను ఆహ్వానించి, రైతుల సమక్షంలోనే జీవో విడుదల చేసేలా భారీగా నిర్వహించిన మంత్రి నిమ్మల రామానాయుడిని ప్రత్యేకంగా అభినందించారు. మంచిని ప్రోత్సహించండి.. పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి. ఆక్వా రంగాన్ని కాపాడి, రైతులను నిలబెట్టి, ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# ఉత్సాహంగా రెండేళ్ల నమ్మకం









**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 11)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలోని కడవకుదురు, చిన్నగంజాం, రాజుబంగారుపాలెం, సంతరావురు, మోటుపల్లి నందు తెలుగుదేశం, కూటమి నాయకుల ఆధ్వర్యంలో రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమ ఇంటింటి ప్రచార కార్యక్రమాలు అత్యంత ఉత్సాహంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా గత రెండు సంవత్సరాలలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, పింఛన్లు, గ్యాస్ సిలిండర్లు, అభివృద్ధి కార్యక్రమాలను నాయకులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గయాల్ భూముల సమస్యలు పరిష్కరించాలి

**అర్హులైన రైతులకు భూ హక్కులు కల్పించాలి**
**మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**
**రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి స్వామి**





**(షణ్ముఖ వెలుగు, కొండపి, ఆగస్టు 11)**

గయాల్, అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం క్యాంప్ కార్యాలయంలో ఒంగోలు ఆర్డీవో, కొండపి, మర్రిపూడి, జరుగుమల్లి, టంగుటూరు, పొన్నలూరు మండలాల తహసీల్దార్లతో మంత్రి స్వామి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొండపి నియోజకవర్గంలో గయాల్ భూములు ఆన్ లైన్ లో నమోదు కాకపోవడం, గతంలో పాసుపుస్తకాలు ఉన్నప్పటికీ 22ఏ లో నమోదు కావడం వంటి సమస్యలతో వేలాదిమంది రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించి జిల్లా స్థాయిలో పరిష్కారమయ్యే వాటిని వెంటనే పరిష్కరించాలని, జిల్లా స్థాయిలో పరిష్కారం కాని భూ సమస్యలపై సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుని అర్హులైన పేదలకు భూమి హక్కులు కల్పించాలని, నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి స్వామి అన్నారు.

# అంగన్‌వాడీ కార్యకర్తలకు 'జ్ఞాన జ్యోతి' శిక్షణ ప్రారంభం




**(షణ్ముఖ వెలుగు, చీరాల, ఆగస్టు 11)**

జాతీయ విద్యా విధానం2020లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న 'జ్ఞాన జ్యోతి' 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా 2, 3 సంవత్సరాల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. వేటపాలెం మండలంలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో వేటపాలెం మండల అంగన్‌వాడీ కార్యకర్తలకు, పేరాలలోని ఏఆర్ఎం హైస్కూల్‌లో చీరాల రూరల్, అర్బన్ ప్రాంతాల అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. చీరాల ఆర్డీవో ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు 0-6 సంవత్సరాల పిల్లల ఎదుగుదల, ఆరోగ్యం, పోషణ, సమగ్ర అభివృద్ధితో పాటు పాఠశాల సంసిద్ధతకు ప్రత్యేకంగా కృషి చేయాలని సూచించారు. చిన్నారుల మెదడు అభివృద్ధిలో తొలి సంవత్సరాలు అత్యంత కీలకమని, ఆ వయస్సులోనే సుమారు 85 శాతం మెదడు అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. పిల్లలకు సరైన సంరక్షణ, పోషణ, అభ్యసన వాతావరణం కల్పించడం ద్వారా భవిష్యత్తులో అన్ని విషయాలను నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొందించవచ్చని పేర్కొన్నారు.ఆగస్టు 11, 12, 13 తేదీలతో పాటు 22, 23, 25 తేదీల్లో మొత్తం ఆరు రోజుల పాటు శిక్షణ కొనసాగనుంది. స్కూల్ ఎడ్యుకేషన్, ఐసీడీఎస్ శాఖల ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సీడీపీవో టి ఝాన్సీ, వేటపాలెం ఎంఈవో 1 శ్రీనివాస్, చీరాల ఎంఈవో 1 రమాదేవి, ఎంఈవో 2 సుధారాణి, జేఆర్ఎం హైస్కూల్ హెచ్ఎం, డీఆర్పీలు, సూపర్‌వైజర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ ప్రారంభం





**(షణ్ముఖ వెలుగు, కంభం ఆగస్టు 11)**

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న మూడు రోజుల జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, కార్యకర్తలలో నైపుణ్యాలను పెంపొందించడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి కోర్సు డైరెక్టర్‌గా అబ్దుల్ సత్తార్, వీరనారాయణ వ్యవహరించగా, కెఆర్పీలుగా మరియదాస్, గోపిశెట్టి శ్రీనివాసులు, వేణుగోపాలాచారి, రాజేష్ పాల్గొని అంగన్వాడీ కార్యకర్తలకు వివిధ అంశాల పై సమగ్ర అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, చిన్నారుల అభివృద్ధి, ప్రీ-స్కూల్ విద్య, పిల్లలలో అభ్యసన సామర్థ్యాల పెంపుదల, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాల పై వివరించారు. సీడీపీఓ కుమారి, సూపర్వైజర్ గాలమ్మ, అంగన్వాడీ కార్యకర్తలకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులతో ప్రేమపూర్వకంగా వ్యవహరిస్తూ, వారికి ఆటలు, పాటలు, కథలు తదితర కార్యకలాపాల ద్వారా విద్యను అందించాలని సూచించారు. చిన్నారుల శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధిని నిరంతరం పర్యవేక్షిస్తూ, తల్లిదండ్రులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. కంభం మండల పరిధిలోని మొత్తం 51 అంగన్వాడీ కేంద్రాల నిర్వాహకులు ఈ మూడు రోజుల జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో పాల్గొని,శిక్షణ ద్వారా తమ విధులు, బాధ్యతలపై మరింత అవగాహన పెంచుకుంటారని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన, నైపుణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని కార్యకర్తలు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో నిపుణుల మార్గదర్శకత్వంలో వివిధ అంశాలపై ప్రాక్టికల్ అవగాహన కల్పించడంతో పాటు, అంగన్వాడీ కేంద్రాల్లో ఎదురయ్యే సమస్యలను చర్చించి వాటి పరిష్కార మార్గాలను కూడా వివరించనున్నారు.

# బాలకోటయ్య సంఘంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 11)**

మండల పరిధిలోని కరేడు పంచాయతీ బాలకోటయ్య సంఘంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు మంగళవారం గత రెండు సంవత్సరాలుగా నమ్మకం అభివృద్ధి సంక్షేమం గురించి లోకల్ నాయకులు డోర్ టు డోర్ తిరుగుతూ ప్రజల సమస్యలు, కష్టసుఖాల గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది. స్థానిక సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు కొనసాగుతామని తెలియజేస్తూ ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోమట్ల వెంకటరామిరెడ్డి బిఎల్ఎ, గుమ్మడి శ్రీనివాసులు, చలంచర్ల వెంకటేశ్వర్లు, నంబూరి వెంకటేశ్వర్లు, కత్తి అంజయ్య, కత్తి కోటేశ్వరమ్మ, ఉబ్బానీ ప్రసన్న, నంబూరు కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరులో అమరులైన మాలల త్యాగం చిరస్మరణీయం

## మోడీ, కూటమి ప్రభుత్వ మనువాద పాలన పై మాలలు పోరాడాలి

## మాల అమరవీరుల 29 వ స్మారక కార్యక్రమంలో దళిత నేత నీలం నాగేంద్రరావు





**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఆగస్టు 11)**

ఎస్సి వర్గీకరణ వ్యతిరేక పోరులో అమరులైన మాల వీరులు పానంగి శేషయ్య, గోపతోటి నారాయణ త్యాగం జాతికి చిరస్మరణీయమని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు నివాళులర్పించారు. మంగళవారం మార్కాపురం ప్రెస్ క్లబ్ లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరులో చంద్రబాబు ప్రభుత్వం జరిపించిన పోలీస్ దమనకాండలో మరణించిన మాల అమరవీరుల 29 వ స్మారక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ 1997 ఆగస్టు 11న ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాల మాదిగలను చీలుస్తూ చేసిన ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ హైదరాబాదులో జరిగిన చలో సెక్రటేరియట్ ముట్టడిలో పానంగి శేషయ్య, గోపతోటి నారాయణ అను మాల వీరులు మరణించారన్నారు. చంద్రబాబు నాయుడు మాలలపై కక్షతో కుట్ర పూర్వకంగా మాలలను గుర్రాలతో తొక్కించి చుట్టూ ఇనుప కంచెలు వేసి పోలీస్ లాటి చార్జి చేయించి మాలలపై మారణకాండ చేయించాడన్నారు. చరిత్రలో బ్రిటిష్ వారు భారతీయులపై జరిపించిన జలియన్వాలాబాగ్ దురంతాన్ని చంద్రబాబు మర్పించి అగ్రకుల సమాజాన్ని ప్రశ్నించి పోరాడిన మాలలపై తన కక్ష తీర్చుకున్నాడు అన్నారు. చంద్రబాబు మనువాద ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించిన పోతుల విగ్నేశ్వర రావు అను పివి రావు అను గజిటెడ్ అధికారిని ప్రభుత్వ ఉద్యోగం నుండి తొలగించి గవర్నమెంట్ గృహం నుండి తొలగించి రోడ్డున పడవేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ అను ప్రభుత్వ పత్రిక సంపాదకుడైన పివి రావు కు తిరిగి ఉద్యోగం ఇవ్వకుండా మానసికంగా వేధించి పివి రావు మరణానికి చంద్రబాబు కారణమయ్యాడన్నారు. 1994లో ఆంధ్రప్రదేశ్లోకి బహుజన సమాజ్ పార్టీ ప్రభంజనంల రావడంతో బెంబేలెత్తిన చంద్రబాబు నాయుడు దళితులుగా చైతన్యమైన సామాజిక పోరాటాలకే పరిమితం కాక బహుజన సమాజ్ పార్టీ అగ్రకుల రాజకీయ అధికారాన్ని కూడా ప్రశ్నిస్తున్నారని దళితులపై కుట్ర చేసి వర్గీకరణ మంత్రాన్ని అమలులోకి తెచ్చారు. మాలా మాదిగలను ఏబిసిడి లుగా చీల్చి జీవో ఇవ్వగా హైకోర్టు కొట్టి వేసిందన్నారు. తరువాత సుప్రీంకోర్టు కూడా ఎస్సీ వర్గీకరణ చెల్ల దని 1/3 మెజార్టీతో పార్లమెంటులో బిల్లు పాస్ కావాలని తీర్పు ఇచ్చిందన్నారు. అంతటితో చతికలబడ్డ చంద్రబాబు బిజెపి విశ్వగురు సనాతన ధర్మ పరిరక్షకుడు మోడీ చరను గోరి పంజాబ్ ఎస్సీ వర్గీకరణ తీర్పును ఉపయోగించి మరల సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయి తో మనువాద కాషాయ తీర్పు ఇప్పించారన్నారు. ఈ విషయం మాలలు మరిచి పోకూడదన్నారు. పార్లమెంటులో రాజ్యాంగ సవరణ ద్వారా జరగాల్సిన ఎస్సి రిజర్వేషన్ల బిల్లును సుప్రీంకోర్టు తన కనుకూలమైన న్యాయమూర్తులు చే ఇప్పించి మాల మాదిగల మధ్య మంట పెట్టటం చంద్రబాబు, మోడీ ప్రభుత్వాల విభజన వాదానికి దళిత వ్యతిరేకతకు నిదర్శనం అన్నారు. గతంలో 2015 వ సంవత్సరంలో ఎస్సీ ఎస్టీ యాక్ట్ అమలకు తూట్లు పొడుస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త బంధు జరిగి 11 మంది మహర్లు పోలీస్ కాల్పుల్లో చనిపోతే మోడీ ప్రభుత్వం స్పందించి మరల పార్లమెంటులో ఎస్సీ ఎస్టీ యాక్ట్ చట్టానికి సవరణ చేసి ఎస్సీ ఎస్టీ అమెండ్మెంట్ యాక్ట్ 2015 జీవో నెంబర్ 1 ను అమలులోకి తెచ్చింది అన్నారు. మనువాద సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును సుప్రీం కోర్టు ఫుల్ బెంచిలో మాలలుగా తాము చాలెంజ్ చేశామన్నారు. రాజకీయ పార్టీలలో ఉన్న మాల ఎమ్మెల్యేలు, ఎంపీలు, కేంద్ర మంత్రులు కులం కార్డుతో పదవులు పొంది కులానికి అన్యాయం చేస్తున్న జాతి ద్రోహులని నీలం మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పార్లమెంటులో బిల్లు పెట్టాలని మాలలు మరో పోరాటం చేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముందు మార్కాపురం కోర్టు సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పివి రావు మాల మహానాడు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య కార్యదర్శి కాకుమాను రవి, నూతలపాటి రాజు, కల్వకూరి అబ్రహం, గొట్టిముక్కల యోహాన్, రామాంజనేయులు మహిళ డొక్కా దానమ్మ, కూకట్లపల్లి శాంతమ్మ తదితరులు నివాళులర్పించారు.

# దామచర్ల, బాలినేని అక్రమ ఆరోపణల పై సమగ్ర విచారణ చేపట్టాలి

## కూటమి నాయకుల కుమ్ములాటల పై కూడా నోరు తెరవలేని ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నేతలు

## దళిత నేత నీలం నాగేంద్రరావు



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 11)**

ఒంగోలు తెలుగుదేశం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, కూటమి భాగస్వామ్యం జనసేన నాయకుడు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పరస్పరం చేసుకున్న విమర్శలపై విచారణ జరిపించాలని దళితహక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేందర్రావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి జగన్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన బాలినేని వైసీపీ పార్టీలో ఓడిపోయి రాజకీయ మనుగడ కోసం జనసేనలో చేరి పొత్తు ధర్మాన్ని ఉల్లంఘించి సాటి కూటమి ఒంగోలు తెలుగుదేశం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన పై విమర్శలు చేయటం బాలినేని రాజకీయ పరిణితికి నిదర్శనం అన్నారు.అలాగే రెండవసారి జనసేన, బిజెపి పొత్తుతో కూటమి ఎమ్మెల్యేగా గెలిచిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కూడా రెచ్చిపోయి బాలినేని బాలినేని పుత్రరత్నం పై భూ ఆక్రమణలు గంజాయి ఆరోపణలు చేయటం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ప్రజలకు సౌకర్యాలు కల్పించటానికి రాజకీయంలోకి వచ్చామని చెప్పుకునే ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, మాజీ మంత్రి బాలినేని ఒకరిపై ఒకరు కుంభకోణాలు, గంజాయి ఆరోపణలు రౌడీయిజం, అక్రమ కేసులు పోలీస్ అధికారులపై ఒకరి ఖేథం మరొకరి మోదం ఆసక్తికరంగా మారాయి అన్నారు. తెలుగుదేశం ఎమ్మెల్యేగా జనార్ధన్, వైసీపీ ఎమ్మెల్యేగా బాలినేని ఎన్నికల అప్పుడు ఒంగోలు గవర్నమెంట్ హాస్పిటల్‌లో జరిగిన దాడి కేసులో సున్నితంగానే స్పందించారన్నారు. వెంగముక్కలపాలెంలో దళితుల పోలింగ్ బూతులు బాలినేని పుత్రరత్నం ప్రణీత్‌రెడ్డి తన భార్యతో కలిసి దళితుల పై దాడి చేసిన, దామచర్ల జనార్ధన్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత కూడా తన అగ్రకుల అభిమానంతో బాలినేని కుటుంబం పై కేసు పెట్టకుండా వదిలేశారన్నారు. బ్రాహ్మణ భూములు ఆక్రమించారని బాలినేని పై బ్రహ్మాండమైన ప్రచారం చేసి తెలుగుదేశం విజయం సాధించిందన్నారు. బాలినేని పుత్రరత్నం అనుచరగణం దాడులతో కూడా ప్రశ్నించే వారిని సుబ్బారావు గుప్తా లాంటి వారిని హింసించి అభాసు పాల అయిందన్నారు. ప్రస్తుతం దామచర్ల జనార్ధన్ కు వ్యతిరేకంగా లేఖ రాశాడని న్యాయవాదిని, మురళి అనే బాలినేని అనుచరుడుని ఒంగోలు తాలూకా సిఐ విజయ్ కృష్ణ వేధించి బాలినేని పేరు వినిపించడానికి ప్రయత్నించాడన్నారు. బాలనేని ఫోన్ చేస్తే అమర్యాదగా మాట్లాడాడని, తాలూకా అనుచరుల పై కేసులు పెట్టడంతో సిఐ విజయ్‌కృష్ణ పై ఆగ్రహంతో ఉన్నారన్నారు. తన కులమైన రెడ్లు ఒంగోలు నియోజకవర్గంలో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవిని దక్కించుకొని జగన్ జైలుకు వెళితే బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్యమంత్రి బంధువు అని భాగా ఊదించుకొని గ్రోబెల్ ప్రచారం చేసుకున్న బాలినేని శ్రీనివాసరెడ్డి మంత్రివర్గ విస్తరణలో మాదిగ కులస్తుడైన ఆదిమూలం సురేష్‌కు రెండవసారి విద్యాశాఖ మంత్రి పదవి దక్కగా ముఖ్యమంత్రి రేసులో ఉన్నామనుకొని చెప్పుకొని మంత్రి పదవిని కూడా పోగొట్టుకున్నారన్నారు. రాజకీయాలే శ్వాసగా రాజకీయం చేసిన బాలినేని శ్రీనివాసరెడ్డి చివరకు జగన్ భార్య భారతి అవిశ్వాసానికి గురై వైసీపీ పార్టీ నుండి బయటికి పంపబడ్డాడన్నారు. రెండేళ్లలో నే కూటమి సనాతన స్టార్ పవన్ కళ్యాణ్ పంచన జేరి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల పై ఎన్నికలు మరో మూడు సంవత్సరాలు ఉండగా ఇప్పటి నుండే ఎన్నికల గేమ్ స్టార్ట్ చేశారన్నారు. కావున కుటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా వుండి భూ కుంభకోణాలు, అవినీతి అక్రమాల ఆరోపణలు చేసుకుంటున్న దామచర్ల జనార్ధన్, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డి ఆరోపణల పై ప్రభుత్వం విచారణ జరిపి వాస్తవాలు ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, మాల సభ కన్వీనర్ మేడికొండ మురళి, తదితరులున్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వన మహోత్సవ కార్యక్రమం





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 11)**

మండల కేంద్రమైన ఉలవపాడు జి.వి.ఎస్.ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ వన మహోత్సవ కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారావు, ఎమ్మార్వో రవిశంకర్, ఎండిఓ సురేష్, అగ్రికల్చర్ ఆఫీసర్ విజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్నటువంటి ఎమ్మార్వో, ఎండిఓ, ఎస్ఐ, అగ్రికల్చర్ ఆఫీసర్ కి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి లక్ష్మీ సుధారాణి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేలా పని చేయాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 11)

ఎల్ నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేలా ద్విముఖ వ్యూహంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ శ్రీ.పి.రాజాబాబు స్పష్టం చేశారు. ఈ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులతో మంగళవారం ప్రకాశం భవనంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎల్‌నినో వలన ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉంటాయని నిపుణులు చెప్తున్న నేపథ్యంలో వరి సాగు చేస్తున్న రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని చెప్పారు. తద్వారా వారి జీవనోపాధికి ఇబ్బంది లేకుండా చూడడంతో పాటు జిల్లా జీడీపీ, జీవీఏ తగ్గకుండా చూడవచ్చు అన్నారు. జిల్లాలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా 6700 లకు పైగా ఎకరాలను గుర్తించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన మాట్లాడుతూ వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు, వాటిలో అంతర పంటలను సాగు చేయడము ద్వారా ఏటా వస్తున్న ఆదాయానికి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతు సేవా కేంద్రాల వారీగా సమావేశాలు నిర్వహించి ఈ విషయాలను తెలియజేయాలని దిశా నిర్దేశం చేశారు. వారికి అవసరమైన విత్తనాలను అందజేయాలన్నారు. తక్కువ నీటి వినియోగంతో ఉద్యాన పంటల సాగుకు ముందుకు వస్తున్న రైతులకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందించాలన్నారు. ప్రస్తుత పరిస్థితులలో తాగునీటి కోసం చెరువులను నింపేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో చెరువులు, బోర్ల కింద సాగు చేయవద్దని రైతులకు చెప్పాలన్నారు. ఆయా బోర్లు ఉన్న ప్రాంతాలలో భూగర్భ నీటిమట్టం ఏ స్థాయిలో ఉన్నదో అంచనా వేయాలని అధికారులకు కలెక్టర్ చెప్పారు. చేపల వేట కోసం చెరువులలోని నీటిని విడుదల చేస్తే ఊరుకోబోమన్నారు. త్రాగునీటిని చేపల చెరువులకు మళ్ళించినా, అక్రమంగా సాగుకు వినియోగించినా కఠిన చర్యలు తప్పవన్నారు. పశు గ్రాసానికి కూడా కొరత లేకుండా చూడాలని, పశుగ్రాసం క్రయవిక్రయాల కోసం సమన్వయం చేసేలా ప్రత్యేక మొబైల్ యాప్ ను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వ్యవసాయ సీజన్ ఊపందుకోనందున కూలీలకు వివిజి రాంజీ పథకం కింద ఉపాధి కల్పించాలని కలెక్టర్ చెప్పారు. ఎల్‌నినో ప్రభావం జిల్లాపై పడకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డ్వామా పిడి జోసఫ్ కుమార్, జిల్లా పశుసంవర్ధక అధికారి రవికుమార్, మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, ఏపీఎంఐపి పిడి శ్రీనివాసులు, ఆత్మ పీడీ రత్న మంజుల, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి, భూగర్భ నీటి వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి





(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 11)

గిద్దలూరు పట్టణంలోని 16వ వార్డు కొండపేట గ్రామంలో "ఇంటింటికీ కూటమి ప్రభుత్వం-సంక్షేమ విజయాలు" కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు నాయకులు, ప్రజలు ఎమ్మెల్యేకి సాగర స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన సేవల గురించి వివరించారు. అలాగే ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పారదర్శక పాలనతో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, పట్టణం , గ్రామాల పురోగతి, రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని వివరించారు. అనంతరం వార్డు నాయకులు, మహిళలు ప్రజలు ఎమ్మెల్యేని శాలువ, పూలమలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం మనందరం కృషి చేయాలి

### నారాయణ స్కూల్స్ క్లస్టర్ ప్రిన్సిపాల్ వేదవతి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 11)

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం మనందరం కృషి చేయాలని నారాయణ స్కూల్స్ క్లస్టర్ ప్రిన్సిపాల్ వేదవతి అన్నారు. నారాయణ స్కూల్స్‌లోని ఎన్‌స్పైరా ఆధ్వర్యంలో మహేంద్రనగర్‌లోని నారాయణ ఈ టెక్నో స్కూల్‌లో మంగళవారం ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో నారాయణ స్కూల్స్ సిబ్బంది, విద్యార్థులకు ఉచితంగా బీపీ, ఈసీజీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అలాగే ఇతర ఆరోగ్య పరీక్షలు చేయడంతో పాటు మంచి ఆరోగ్య పద్ధతులు, ఆహార నియమాలపై ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ నుంచి వచ్చిన డాక్టర్ కార్తీక్ కామినేని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తీక్ కామినేని మాట్లాడుతూ.. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వార్షికోత్సవం సందర్భంగా నారాయణ స్కూల్‌లో ఈ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిబ్బందికి ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు వారి సాధారణ ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు. విద్యార్థులు మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని, అప్పుడే మంచి సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. నారాయణ స్కూల్స్ క్లస్టర్ ప్రిన్సిపాల్ వేదవతి మాట్లాడుతూ నారాయణ స్కూల్స్ యాజమాన్యం విద్యార్థులు, సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. స్కూల్స్ హెచ్‌ఆర్ విభాగం ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇటువంటి శిబిరాల ద్వారా విద్యార్థులు, సిబ్బంది ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు సూచించిన నివారణా మార్గాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్ కామినేని, క్లస్టర్ ప్రిన్సిపాల్ వేదవతి, హెచ్‌ఆర్ మస్తానయ్య, ప్రిన్సిపాల్ నాగ సురేష్, ఏఓ నాగలక్ష్మి పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా ర్యాలీ



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 11)

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని 23ఆంధ్రా బెటాలియన్ ఎన్.సి.సి పరిధిలోని చిన్నగంజాం జేడ్పి హైస్కూల్ విద్యార్థులు స్థానిక సోపిరాల, అంబెడ్కర్ సెంటర్ నందు జాతీయ జెండాలను చేతబూని, దేశభక్తి నినాదాలతో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రతి భారతీయుడు, విద్యార్థులు పెద్దఎత్తున భాగస్వామ్యమై స్వచ్ఛందంగా తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశంపై తమకున్న భక్తిభావాన్ని చాటుకోవడానికి ఇది సువర్ణావకాశమని పేర్కొన్నారు.ఇ కార్యక్రమంలో ఎన్.సి.సి అధికారి సుబ్బారావు,ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు పర్వతరెడ్డి శ్రీలక్ష్మి,పూర్వ ఎన్.సి.సి అధికారి నరశింహరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి





(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 11)

స్థానిక నాయక్ వీధి ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ అబ్దుల్ సత్తార్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు పరిశీలించిన ఎంఈఓ తరగతి గదుల్లో విద్యార్థుల అభ్యసన స్థాయిని స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడిగి, చదవడం, రాయడం, విషయాలను అర్థం చేసుకోవడంలో ఏ స్థాయిలో ఉన్నారో తెలుసుకున్నారు. విద్యార్థులు అభ్యసన నైపుణ్యాలలో వెనుకబడిన వారిని గుర్తించి, వారికి ప్రత్యేక బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతిరోజూ విద్యార్థుల హాజరును పర్యవేక్షిస్తూ, పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు.

### పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అన్ని పాఠశాలల్లో పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని ఎంఈఓ అబ్దుల్ సత్తార్ ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత, క్రమశిక్షణ వంటి విలువలను పెంపొందించేలా కార్యక్రమాలను రూపొందించాలని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించనున్న ఆటపాటలు, దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఎంఈఓ స్వయంగా పరిశీలించారు. విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించిన ప్రదర్శనలను అభినందించారు. కార్యక్రమాలకు సంబంధించిన వీడియోలను చిత్రీకరించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని ఎంఈఓ పేర్కొన్నారు. విద్యతో పాటు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని, విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన మార్గదర్శకాలు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో సిఆర్పి మురళి, ప్రధానోపాధ్యాయులు త్రివిక్రమరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొల్లూరుపాడు గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 11)

మండల పరిధిలోని కొల్లూరుపాడు గ్రామం ఎస్సీ కాలనీబూత్ నెంబర్ 250 లో కందుకూరు శాసనసభ్యు లు ఇంటూరు నాగేశ్వరావు ఆదేశాల మేరకు శుక్రవారం గత రెండు సంవత్సరాలుగా కుటమి ప్రభుత్వం చేసినటువంటి అభివృద్ధి సంక్షేమం గురించి లోకల్ నాయకులు డోర్ టు డోర్ తిరిగి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెలిచెర్ల ప్రభాకర్ (డీలర్) మేస్త్రి రావినూతల నరసింహ, అమ్ములమ్మ, గోవిందమ్మ, ఆదెమ్మ, చిన్నమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

## పేదలకు అండగా సీఎం చంద్రబాబు

**ఆరోగ్యానికి ఆర్థిక భరోసా సీఎంఆర్ఎఫ్**
**ఏడుగురికి రూ.10.55 లక్షల వైద్య సాయం**
**చెక్కులు అందించిన ఎమ్మెల్యే ఏలూరి**





(షణ్ముఖ వెలుగు, మార్టూరు, ఆగస్టు 11)
పేద, మధ్యతరగతి ప్రజలు అనారోగ్యం బారినపడినప్పుడు ఆర్థిక భారంతో అల్లాడకుండా ఆదుకోవాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టిన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) పథకం అనేక పేద కుటుంబాలకు వరంగా మారుతోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. మంగళవారం ఇసుక దర్శిలో ఎమ్మెల్యే ఏలూరి సిఫారసు మేరకు మంజూరైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) మొత్తం రూ.10,55,053 చెక్కులను ఆయన అందజేశారు. పూనూరుకు చెందిన బోయిన శారదకు చీరాల మణిక్యమ్మ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం రూ.49,319, ద్రోణాదులకు చెందిన గొట్టం సుబ్బారావుకు ఒంగోలు మెడిక్యూర్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం రూ.1,51,616, వీరన్నపాలెం కి చెందిన గోరంట్ల విజయలక్ష్మికి గుంటూరు ఆదిత్య మెడికేర్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం రూ.72,801 అందజేశారు.అలాగే తాటివారిపాలెంకి చెందిన మద్దుమల అయ్యన్నకు ఒంగోలు సంఘమిత్ర ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం రూ.2,01,460, మార్టూరు-4కు చెందిన సంగిరెడ్డిగారి వాసవి బిడ్డకు చికిత్స నిమిత్తం రూ.1,48,144తో, నూతలపాడు-1కు చెందిన వుట్ల పల్లవి బిడ్డకు చిలకలూరిపేట వరలక్ష్మి ఫెర్టిలిటీ అండ్ మెటర్నిటీ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం రూ.1,28,244, నూతలపాడు-1కే చెందిన కాకర్లమూడి చార్వీణికి గుంటూరు కిమ్స్ శిఖర ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం రూ.3,03,469, ఎల్ఓసీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ, పేద ప్రజలు అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకోకుండా ఆదుకోవాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. ఆ దిశగానే సీఎంఆర్ఎఫ్ పథకాన్ని సమర్థంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ దరఖాస్తుల పరిష్కారంలో పర్చూరు రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉందని తెలిపారు.

## తెలుగుదేశం పార్టీ యద్దనపూడి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తారక రామారావు, అశోక్

**నూతన మండల కమిటీని ప్రకటించిన ఎమ్మెల్యే ఏలూరి**

(షణ్ముఖ వెలుగు, యద్దనపూడి, ఆగస్టు 11)





యద్దనపూడి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా గుదే తారక రామారావు, ప్రధాన కార్యదర్శిగా అశోక్‌కుమార్ తమ్మలూరి నియమితులయ్యారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నూతన కమిటీని ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా సుధీర్‌బాబు సాదినేని, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పూనూరు సురేష్ తేలగతోటి, సురవరపుపల్లి ముత్యాల లక్ష్మీ ప్రసాద్, యనమదల తన్నీరు శ్రీనివాసరావు, కార్యదర్శులుగా యద్దనపూడి హనుక్ పల్లెపోగు, గన్నవరం జాఫర్ వలి, పోలూరు తాళ్లూరి శ్రీరాములు, కోశాధికారిగా తనుబుద్ధివారిపాలెం బసివిరెడ్డి తనుబొద్ది నియమించారు.నూతన కమిటీకి పార్టీని మండలంలో మరింత బలోపేతం చేయడంతోపాటు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే ఏలూరి సూచించారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల సమన్వయంతో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే ఏలూరి అభినందనలు తెలిపారు.

# నూతన జిల్లాలో తొలిసారిగా ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ

## జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

**వేడుకలు ప్రతి ఒక్కరికీ మధుర స్మృతిగా నిలిచిపోవాలి**
**అధికారుల సమీక్షా సమావేశంలో మార్గదర్శకాలు**
**త్వరలోనే వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం**
**నిర్వాసితుల పునరావాసానికి అత్యున్నత ప్రాధాన్యత**
**ఎస్వికేపీ కళాశాల మైదానంలో అత్యంత వైభవంగా జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు**
**పాఠశాల విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొననున్నందున పక్కాగా ట్రాఫిక్, క్రౌడ్ మేనేజ్మెంట్**
**మంచినీరు, పారిశుధ్యం, నీడ, తాత్కాలిక శౌచాలయాలు, స్నాక్స్, డెకరేషన్, సాంస్కృతిక ప్రదర్శనలపై ప్రత్యేక దృష్టి**
**వినూత్న శకటాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల స్టాళ్ల ఏర్పాటు**
**సమయపాలన ఖచ్చితంగా పాటించాలని ఆదేశం**
**వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల కాలనీల్లో అన్ని వసతుల కల్పన**
**పెన్షన్ల పంపిణీ మరింత వేగవంతం**







(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 11)
నూతనంగా ఏర్పడిన జిల్లా కేంద్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, జిల్లా ప్రజలందరికీ ఒక తీపి గుర్తుగా, మధుర స్మృతిగా నిలిచిపోయేలా నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాబోయే స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై అధికారులతో జిల్లా కలెక్టర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మొదటిసారిగా జరుగుతున్న ఈ చారిత్రాత్మక స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రజలంతా సంతోషంగా జరుపుకునేలా శకటాల ప్రదర్శన, వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతిబింబించేలా స్టాళ్ల ఏర్పాటు, విద్యార్థుల ఆకట్టుకునే సాంస్కృతిక కార్యక్రమాలను వినూత్న రీతిలో రూపొందించాలని ఆదేశించారు. ఈ సంబరాలకు జిల్లా నలుమూలల నుండి భారీ సంఖ్యలో పాఠశాల విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, పురప్రజలు, మీడియా ప్రతినిధులు రానున్నందున ఎవరికీ ఎటువంటి చిన్న అసౌకర్యం కూడా కలగకుండా ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో రానున్నందున ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్, మైదానంలో క్రౌడ్ మేనేజ్మెంట్ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. విఐపి, మీడియా, సాధారణ ప్రజలకు స్పష్టమైన సీటింగ్ ప్రాంగణాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. వేడుకల ప్రాంగణంలో తాగునీరు, పారిశుధ్యం, తాత్కాలిక శౌచాలయాలు, ఎండ దెబ్బ తగలకుండా నీడ సౌకర్యం, విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ పక్కాగా నిర్వహించాలి. ప్రాంగణం బ్యూటిఫికేషన్, డెకరేషన్ ఆకట్టుకునేలా ఉండాలని సూచించారు. కార్యక్రమాల నిర్వహణలో అధికారులు ఖచ్చితమైన సమయపాలన పాటించాలని, కేటాయించిన నిర్దిష్ట సమయానికి అన్ని కార్యక్రమాలు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి అంశాలపై సమీక్షిస్తూ కలెక్టర్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే జిల్లాను సస్యశ్యామలం చేసే దిశగా ప్రతిష్టాత్మక వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించబోతున్నామని కలెక్టర్ ప్రకటించారు. ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసానికి సంబంధించి అధికారులు అత్యంత ప్రాధాన్యతనిచ్చి పని చేయాలని ఆదేశించారు. నిర్వాసితుల కాలనీలలో త్రాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర అన్ని సౌకర్యాలను ఎటువంటి లోపాలు లేకుండా కల్పించాలని, పునరావాస ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరగాలని స్పష్టం చేశారు. అలాగే జిల్లాలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని మరింత ప్రభావవంతంగా, లబ్ధిదారులకు సకాలంలో అందేలా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రజలందరూ ఈ చారిత్రాత్మక స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలలో విశేష సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) సుబ్బారావు, డ్వామా పీడీ సువార్త, ఐసిడిఎస్ ఇంచార్జ్ పీడీ పద్మావతి, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, మార్కాపురం తహసీల్దార్ చిరంజీవితో పాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మేదరమెట్లలో "దూకుడు" పెంచిన ఎస్ఐ రమేష్ బాబు

## చార్జ్ తీసుకున్నప్పటినుంచి అసాంఘిక కార్యకలాపాలపై కట్టడి

**ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి**
**రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు**

(షణ్ముఖ వెలుగు, మేదరమెట్ల, ఆగస్టు 11)
పోలీస్ స్టేషన్ ఎస్ఐగా రమేష్ బాబు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విధి నిర్వహణలో దూకుడు పెంచాడు. బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించారు. ట్రాఫిక్ నివారణకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టారు.మంగళవారం రోడ్డు



ప్రమాదాల నివారణకు ఆయన ద్విచక్ర వాహనదారులకు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చారు. హెల్మెట్ ప్రమాద సమయంలో రక్షణగా నిలుస్తుందని ప్రతి ఒక్కరూ కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలని ఎస్సై రమేష్ బాబు సూచనలు చేశారు. హెల్మెట్ లేకపోవడం వలన ప్రాణాలు పోతున్నాయని ఆయన భావోద్వేగంగా మాట్లాడారు. అనంతరం ద్విచక్ర వాహనదారులకు ఎస్సై రమేష్ బాబు ఉచితంగా హెల్మెట్లను అందించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





## ప్రజా పంపిణీని పటిష్టం చేయాలి

**నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలను అరికట్టాలి**
**ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 11)
నిత్యవసర వస్తువుల ధరలు నింగి నంటుతున్నాయని, ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి అన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం ఐద్వా జిల్లా కమిటీ సమావేశం ఎస్ కే మున్వర్ సుల్తానా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ వ్యవసాయం గిట్టుబాటు కావట్లేదని, కనీస మద్దతు ధరల చట్టం కావాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని ఒక వైపు పెద్ద ఎత్తున ఉద్యమాలు సాగుతున్నాయని అన్నారు. మరోవైపు పంటలు పండించిన రైతుకు గిట్టుబాటు కాకుండా, సాధారణ ప్రజలు కొనుగోలుకు అవకాశం లేకుండా మధ్యనున్న వ్యాపారులు, కార్పొరేట్ శక్తులు లాభాలు పొందే విధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఈ కాలంలో ఉప్పులు పప్పులు బియ్యం నూనెలు అన్ని రకాల వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు సాధారణ మధ్యతరగతి ప్రజలు కూడా కొనలేని తినలేని స్థితి ఏర్పడిందని అన్నారు. ధరలు ఇలా పెరుగుతుంటే పాలకులు గుడ్లు అప్పగించి చూస్తున్నారు తప్ప నివారించే చర్యలు ఏవి చేపట్టలేదని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సిన బాధ్యత విస్మరించి దాన్ని బలహీనపరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని అన్నారు. అంత్యోదయ అన్న యోజన పథకంలో తొమ్మిది కోట్ల మంది ఉన్నారని వారికి ఇప్పటివరకు కుటుంబానికి 35 కేజీలు ఇచ్చే బియ్యాన్ని ఒక వ్యక్తి ఉంటే ఏడు కేజీలు కుదించారని అన్నారు. కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ వివరాల ప్రకారం పౌష్టికాహారం అందక దేశంలో 33% మంది ఎదుగుదల లోపంతో, 32 శాతం మంది అంగవైకల్యంతో, 67% మంది రక్తహీనతతో ఉన్నారని తెలిపారు. ఈ స్థితి నుండి ప్రజలను కాపాడేందుకు ప్రజలందరికీ ఆహార ధాన్యాలు 16 రకాల నిత్యవసర వస్తువులు చౌక ధరల దుకాణాల ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా 80 ఏళ్ల స్వాతంత్రం మహిళలకు ఏమిచ్చింది అనే అంశంపై సభలు సమావేశాలు నిర్వహించాలని, డ్రగ్స్ మత్తుమందుల నిర్మూలనకు విద్యార్థి యువజన సంఘాల తో కలిసి ఉద్యమాలు చేపట్టాలని సమావేశం నిర్ణయించినట్లు అని తెలిపారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా కోశాధికారి బి రాజ్యలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి జి ఆదిలక్ష్మి, జిల్లా నాయకురాళ్ళు బి గోవిందమ్మ, అంగలకుర్తి విశ్రాంత, కే రాజేశ్వరి, ఎం పద్మ, ఎస్‌కే మల్లికా, ఎస్ విజయలక్ష్మి, ఏ అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ పోటీలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 11)
ఈ నెల 12న బుధవారం నుండి యోనెక్స్ సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్ 2026 రాష్ట్ర స్థాయి అండర్ 19 బాల బాలికల జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు ఒంగోలు లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీలో జరుగుతాయని ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మా రెడ్డి కార్యదర్శి పి.విజయ కృష్ణా, లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీకృష్ణ ఒక ప్రకటన తెలియజేశారు. ఒంగోలు హైదరి క్లబ్ లో జరిగిన ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో ఈ మేరకు పోటీల నిర్వహణ నిర్ణయం తీసుకున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మా రెడ్డి,కార్యదర్శి పి.విజయ కృష్ణా తెలిపారు. లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా బుధవారం నుండి అండర్ 19 బాల బాలికలు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతున్నట్టు తెలిపారు. ఇందుకుగాను. ఈనెల 12 బుధవారం క్వాలిఫైయింగ్ మ్యాచులు, 13 నుంచి మెయిన్ డ్రా, 16న ఫైనల్ పోటీలు జరుగుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. నాలుగు రోజులు జరిగే పోటీలలో ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మరియు ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఇసి మెంబర్ ఎమ్ రఘుబాబు పోటీలకు ఆర్గనైజింగ్ సెక్రటరీ గా వ్యవహరిస్తారని నిర్వాహకులు తెలిపారు. అంతే కాకుండా ప్రకాశం జిల్లాకు చెందిన ముఖ్య ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.



# దేశంలో కొనసాగుతున్న ‘మార్పు అవసరం’ సిపిఐ ప్రచార జాత

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ ప్రకాశం జిల్లా సమగ్రాభివృద్ధి కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 11)

జాతీయస్థాయిలో గల్లీ నుండి ఢిల్లీ వరకు నరేంద్ర మోడీ పాలన లో కొనసాగుతున్న అకృత్యాలు, ప్రజలకు జరుగుతున్న అన్యాయాలు, దేశ సౌభాగ్యత్వానికి జరుగుతున్న ముప్పు, దేశంలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగులు, కార్మికులు, యువకులు అందరికీ సంబంధించిన సమస్యల పైన, వాళ్లను మేలుకొలుపుతూ పాదయాత్రలు ఆగస్టు 6 నుండి 15వ తేదీ వరకు కొనసాగుతా ఉన్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, జంగాల అజయ్ కుమార్ పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ కోరుకుంటున్నా మార్పు బడా కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా సామాన్యుల పాలిట భారా లు, కార్పొరేటర్లకు వరాలు అనే పద్ధతిలో కొనసాగుతున్న నయవంచన పాలనను ఎండ కడుతూ, భారతదేశంలో ఉన్న ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం రావాలని, ప్రతి వ్యవసాయ కార్మికులకు పని దినాలు పెంచాలని, కూలిరేటు పెంచాలని, పనులు గ్యారెంటీ దినాలు ఇవ్వాలని, కేంద్రం కొత్తగా ప్రవేశపెట్టిన విబిజి రాంజీ బిల్లును వెనక్కి తీసుకోవాలని, దాని స్థానంలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తాము అధికారులకు వచ్చిన వెంటనే రైతుల కళలు ఆనందం చూస్తానని ఇచ్చిన హామీ ప్రకారం పండిన పంటకు గిట్టుబాటు ధర ఇస్తామని, డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తామని, కౌలు రైతులకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని చెప్పిన హామీని పరిచారన్నారు. రైతుల పరిస్థితి చూస్తే లేదు ముందు నుయ్యి, వెనక గొయ్యి అన్న తీరుగా మారిందన్నారు. రైతులను దారుణంగా మోసం చేస్తూ, మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకువస్తే, వాటికి వ్యతిరేకంగా, సుదీర్ఘమైన విరోచిత్తమైన పోరాటం చేస్తే, ఆ పోరాటానికి తలోగ్గి, మూడు నల్ల వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుంటున్నామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చి, దొడ్డి దారిన మళ్ళీ వీటిని అమలు జరిపేందుకు ప్రయత్నం కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోసపూరితమైన నరేంద్ర మోడీ వైకిరిని ఈ పాదయాత్రల సందర్భంగా గ్రామ గ్రామాన ఎండ కడతా ఉన్నామన్నారు. అలాగే భారత దేశంలో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని, తొలగించి దాని స్థానంలో 12 గంటల పని విధానాన్ని ప్రవేశపెడితే దానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఆందోళనలకు పూనుకుంటుదన్నారు. రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ పాదయాత్ర కొనసాగుతుందన్నారు. దేశంలో అటవీ భూములు, ఆదివాసీల కడుపు కొట్టి, అటవీ సంపద, అంబానీలకు ఆదానీలకు దోచిపెట్టె నరేంద్ర మోడీ వైఖరికి నిరసనగా పాదయాత్రలు కొనసాగుతున్నాయన్నారు. మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ పాదయాత్రలు కొనసాగుతున్నాయన్నారు. దేశంలో నరేంద్ర మోడీ, అమిత్ షా ఇద్దరు గుజరాతీలు దేశాన్ని, దేశ సంపదను అమ్ముతా ఉంటే, ఇద్దరు గుజరాతీయులు అంబానీ, అదానీలు కొనుగోలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఉన్న నిరుద్యోగులు ఆకలి చావులు దేశభక్తా అని ప్రశ్నించారు. దేశానికి అన్నం పెడుతున్న రైతన్న ముజుకోయికవు వేలాడటం దేశభక్తా అన్నారు. దేశంలో ఉన్న ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేయటం దేశభక్తా అని ప్రశ్నించారు. దొంగే దొంగ దొంగ అన్న తీరుగా దేశద్రోహులు, దేశభక్తి గురించి మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. భోగాపురంలో ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమం కేవలం నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ లా భజన కార్యక్రమంగా మారిందని విమర్శించారు. బిజెపి పాలిత ప్రాంతాలలో కూడా ఇంత ఆర్భాటంగా, ఖర్చు చేసి ఏర్పాటుచేసిన కార్యక్రమాలు లేవన్నారు. రూ. 600 కోట్ల ప్రజాధనాన్ని కేవలం నరేంద్ర మోడీకి భజన చేసేందుకు దుర్వినియోగి చేయటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఎంత జరిగినా నరేంద్ర మోడీ రాష్ట్రానికి ఒక్క చిన్న హామీని కూడా ప్రకటించిన పాపాన పోలేదన్నారు. చంద్రబాబు నాయుడు కూడా ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు హామీలను నెరవేర్చటంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. మహిళలకు నెలకు రూ. 1500 హామీ అమలు చేయలేదన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి నెలకు రూ. 3 వేలు ఎక్కడ అన్నారు. బీసీలకు 50 సంవత్సరాల పింఛన్ పథకం ఎక్కడ అమలు జరుగుతుందో చెప్పాలని ప్రశ్నించారు. వీటన్నిటి పరిష్కారం కోసం దేశంలో, రాష్ట్రంలో మార్పు కావాలంటూ సిపిఐ ప్రచార జాతాలను కొనసాగిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే 17వ తేదీ నుండి 28వ తేదీ వరకు పార్టీ అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయా వర్గాల సమస్యలపై సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నట్లు



తెలిపారు. నరేంద్ర మోడీ హటావో, దేస్ కి బచావో నినాదంతో సెప్టెంబర్ 1వ తేదీన ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో భారీ ఇతర నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ఆయా కార్యక్రమాలలో ప్రజలు విరుగుగా పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఆర్ వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు దాటుతున్నప్పటికీ ఎలాంటి కొత్త పెన్షన్లు ఇవ్వలేదని విమర్శించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన రెవిన్యూ క్లినిక్లలో ఎటువంటి సమస్యలు పరిష్కారం కాకుండానే, పరిష్కారమైనట్లు బాధితులకు మెసేజ్ లు పంపుతున్నారని అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారులు, కలెక్టర్ కేవలం ప్రజాప్రతినిధులు చెప్పిన సమస్యలనే కాకుండా, ప్రజల నుండి వస్తున్న వినతుల పైన కూడా స్పందించాలని హితవు పలికారు. ఒంగోలుకు సమీపంలో 700ఎకరాలు ఒక ఆక్వా కంపెనీ రొయ్యల సాగు చేస్తుంటే, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన ఎటువంటి స్పందన లేదన్నారు. అధికారులను వివరాలను అడిగిన తమకు ఇంకా రిపోర్టు రాలేదని అబద్దాలు చెబుతున్నారు అన్నారు. బడా పెట్టుబడి దారుల కు కొమ్ము దేశంలో కొనసాగుతున్న ‘మార్పు అవసరం’ సిపిఐ ప్రచార జాత జాతీయస్థాయిలో గల్లీ నుండి ఢిల్లీ వరకు నరేంద్ర మోడీ పాలన లో కొనసాగుతున్న అకృత్యాలు, ప్రజలకు జరుగుతున్న అన్యాయాలు, దేశ సౌభాగ్యత్వానికి జరుగుతున్న ముప్పు, దేశంలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగులు, కార్మికులు, యువకులు అందరికీ సంబంధించిన సమస్యల పైన, వాళ్లను మేలుకొలుపుతూ పాదయాత్రలు ఆగస్టు 6 నుండి 15వ తేదీ వరకు కొనసాగుతా ఉన్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, జంగాల అజయ్ కుమార్ పేర్కొన్నారు.ప్రకాశం జిల్లా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ కోరుకుంటున్నా మార్పు బడా కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా సామాన్యుల పాలిట భారా లు, కార్పొరేటర్లకు వరాలు అనే పద్ధతిలో కొనసాగుతున్న నయవంచన పాలనను ఎండ కడుతూ, భారతదేశంలో ఉన్న ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం రావాలని, ప్రతి వ్యవసాయ కార్మికులకు పని దినాలు పెంచాలని, కూలిరేటు పెంచాలని, పనులు గ్యారెంటీ దినాలు ఇవ్వాలని, కేంద్రం కొత్తగా ప్రవేశపెట్టిన విబిజి రాంజీ బిల్లును వెనక్కి తీసుకోవాలని, దాని స్థానంలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తాము అధికారులకు వచ్చిన వెంటనే రైతుల కళలు ఆనందం చూస్తానని ఇచ్చిన హామీ ప్రకారం పండిన పంటకు గిట్టుబాటు ధర ఇస్తామని, డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తామని, కౌలు రైతులకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని చెప్పిన హామీని పరిచారన్నారు. రైతుల పరిస్థితి చూస్తే లేదు ముందు నుయ్యి, వెనక గొయ్యి అన్న తీరుగా మారిందన్నారు. రైతులను దారుణంగా మోసం చేస్తూ, మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకువస్తే, వాటికి వ్యతిరేకంగా, సుదీర్ఘమైన విరోచిత్తమైన పోరాటం చేస్తే, ఆ పోరాటానికి తలోగ్గి, మూడు నల్ల వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుంటున్నామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చి, దొడ్డి దారిన మళ్ళీ వీటిని అమలు జరిపేందుకు ప్రయత్నం కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మోసపూరితమైన నరేంద్ర మోడీ వైకిరిని ఈ పాదయాత్రల సందర్భంగా గ్రామ గ్రామాన ఎండ కడతా ఉన్నామన్నారు. అలాగే భారత దేశంలో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని, తొలగించి దాని స్థానంలో 12 గంటల పని విధానాన్ని ప్రవేశపెడితే దానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఆందోళనలకు పూనుకుంటుదన్నారు. రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ పాదయాత్ర కొనసాగుతుందన్నారు. దేశంలో అటవీ భూములు, ఆదివాసీల కడుపు కొట్టి, అటవీ సంపద, అంబానీలకు ఆదానీలకు దోచిపెట్టె నరేంద్ర మోడీ వైఖరికి నిరసనగా పాదయాత్రలు కొనసాగుతున్నాయన్నారు. మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ పాదయాత్రలు కొనసాగుతున్నాయన్నారు. దేశంలో నరేంద్ర మోడీ, అమిత్ షా ఇద్దరు గుజరాతీలు దేశాన్ని, దేశ సంపదను అమ్ముతా ఉంటే, ఇద్దరు గుజరాతీయులు అంబానీ, అదానీలు కొనుగోలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఉన్న నిరుద్యోగులు ఆకలి చావులు దేశభక్తా అని ప్రశ్నించారు. దేశానికి అన్నం పెడుతున్న రైతన్న ముజుకోయికవు వేలాడటం దేశభక్తా అన్నారు. దేశంలో ఉన్న ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేయటం దేశభక్తా అని ప్రశ్నించారు. దొంగే దొంగ దొంగ అన్న తీరుగా దేశద్రోహులు, దేశభక్తి గురించి మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. భోగాపురంలో ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమం కేవలం నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ లా భజన కార్యక్రమంగా మారిందని విమర్శించారు. బిజెపి పాలిత ప్రాంతాలలో కూడా ఇంత ఆర్భాటంగా, ఖర్చు చేసి ఏర్పాటుచేసిన కార్యక్రమాలు లేవన్నారు. రూ. 600 కోట్ల ప్రజాధనాన్ని కేవలం నరేంద్ర మోడీకి భజన చేసేందుకు దుర్వినియోగి చేయటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఎంత జరిగినా నరేంద్ర మోడీ రాష్ట్రానికి ఒక్క చిన్న హామీని కూడా ప్రకటించిన పాపాన పోలేదన్నారు. చంద్రబాబు నాయుడు కూడా ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు హామీలను నెరవేర్చటంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. అధికారులకు కొమ్ము కాయటం లో అధికారులు మునిగి తేలుతున్నారన్నారు. గ్రానైట్ యజమానులు ప్రభుత్వ భూములను లీజు కి తీసుకుని తన ఇష్టం వచ్చినట్లు గ్రానైట్ తొవ్వుకుంటున్నారన్నారు. డంపింగ్ కూడా ఇష్టారీతిన చేస్తున్నారన్నారు. కాలుష్యం ప్రజలకి, ఆదాయాలు పెద్దలకి అన్న తీరుగా గ్రానైట్ వ్యవహారం ఉందని, దీనిని అధికారులు తమకు అనుకూలంగా మార్చుకొని కోట్లు ఆర్జిస్తున్నారని విమర్శించారు. కాలుష్య నివారణకు చేపట్టాల్సిన మొక్కల నివారణ కూడా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దర్శి సమీపంలో ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి కోసం గత ప్రభుత్వం గానీ, ఈ ప్రభుత్వం గానీ ఇప్పటివరకు ఒక చర్య కూడా తీసుకోలేదని విమర్శించారు. కోస్టల్ క్యారిడార్ అభివృద్ధి కోసం, ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి కోసం, ఎయిర్పోర్ట్ అభివృద్ధి కోసం ఎటువంటి చర్యలు లేవన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్రానికి ప్రతి ఏడాది రూ. 73 వేల కోట్లు అందిస్తున్న ప్రకాశం జిల్లాకు, అందులో నుండి వెనుకబడిన ప్రకాశం జిల్లాకు రూ.10 వేల కోట్లు నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సమావేశంలో బికేయంయు జిల్లా నాయకులు దాసరి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 11)

ఆగస్టు 15న జరుపుకోనున్న 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా ఒక పండుగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి మండలాధికారులు, మునిసిపల్ కమిషనర్లు వివిధ శాఖల అధికారులతో స్వాతంత్ర దినోత్సవ వేడుకల పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొనేలా చూడాలన్నారు. 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించనున్నామని, ఆ కార్యక్రమాలలో ప్రజలందరూ భాగస్వాములు అయ్యేటట్లు కార్యక్రమాలం నిర్వహించాలన్నారు. స్వాతంత్రం ఎలా వచ్చింది, దాని ఆవశ్యకత అందరికీ తెలియవలసిన అవసరం ఉందన్నారు. మరీ ముఖ్యంగా నేటి యువతకు తెలియవలసిన అవసరం ఉందన్నారు. ఎంతో మంది త్యాగధనుల సహకారంతో మనకు స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు లభించాయన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఒక దీపావళి, సంక్రాంతి, దసరా పండుగ లాగా నిర్వహించుకోవాలన్నారు. ప్రజలందరూ స్వతంత్రంగా స్వతహాగా ఈ వేడుకల్లో పాల్గొని సెల్ఫీ వీడియోలు తీసుకొని అప్లోడ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2047 వికసిత భారత్ లక్ష్యంగా, ప్రపంచ పటంలో భారతదేశాన్ని మొదటి స్థానంలో ఉండే విధంగా లక్ష్యాలు నిర్దేశించుకోవడం జరగాలని ఆ విధంగా ముందుకు వెళ్లవలసిన అవసరం ఉందన్నారు. ప్రతి ఇంటి మీద మువ్వన్నెల జెండా ఎగరాలని ఆయన సూచించారు. ప్రాచీన ,చారిత్రక కట్టడాలు, ప్రభుత్వ భవనాలు, స్కూల్లు కాలేజీలు తదితరాలన్నీ మూడు రంగుల బల్బులతో వెలగాలని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొని వ్యక్తిగతంగా పండుగ వాతావరణం నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. మండల అధికారులు జిల్లా అధికారులందరూ ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






# అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు జ్ఞానజ్యోతి శిక్షణ

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 11)

జ్ఞాన జ్యోతి శిక్షణ ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలు మెరుగైన శిక్షణ పొంది అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలలకు మరింత మెరుగైన విద్య అందించేందుకు అవకాశం ఉంటుందని మండల విద్యాధికారి కోటేశ్వరరావు అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన ప్రీ-స్కూల్ విద్యను అందించి, వారిని పాఠశాల విద్యకు సమర్థవంతంగా సిద్ధం చేయడం ప్రధాన లక్ష్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయ కులకు జ్ఞానజ్యోతి ద్వారా మండలంలోని కడవకుదురు హైస్కూల్ నందు ముడు రోజుల శిక్షణ తరగతులను మంగళవారం మండల విద్యా, స్త్రీ,శిశు సంక్షేమ అధికారులు ప్రారంభించారు.ఇ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శిక్షణలో చిన్నారుల మేధో అభివృద్ధిపై అవగాహన,చిన్నరుల శారీరక అభివృద్ధి,భాషాభివృద్ధి, సాంస్కృతిక, సృజనాత్మక పెంపు అంశాల పై కార్యకర్తలకు అవగాహన కల్పించారు.ఇ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వీర ప్రసాద్,మండల విద్యాదికారి కోటేశ్వరరావు, డిఅర్పిలు ఎన్.శ్రీనివాసరెడ్డి, వి సంబశివరావు, వి వెంకటేశ్వరరావు, కె వాణిశ్రీ, ఎన్ సుమలత పాల్గొన్నారు.